


# విజయభాను




విశాఖపట్నం, శనివారం 21-04-2018 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 41 సంచిక : 216 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ

# బాబు ధర్మాగ్రహం




- ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం వేదికగా దీక్షాశిబిరం
- ముఖ్యమంత్రిని ఆశీర్వదించిన మతపెద్దలు
- తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, తెదేపా శ్రేణులు
- జనావళికి చంద్రబాబు బహిరంగ లేఖ
- దీక్షకు విస్తృత ఏర్పాట్లు
- జనం తరఫున ఉద్యమ శంఖారావం
- భారీ బందోబస్తు మధ్య దీక్ష ప్రారంభం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయానికి నిరసనగా ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం తన జన్మదినం రోజున ధర్మ పోరాట దీక్ష పేరిట నిరాహార దీక్ష చేపట్టారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన ఈ




దీక్ష రాత్రి ఏడింటి వరకు కొనసాగనుంది. దీక్షా స్థలికి చేరుకున్న చంద్రబాబు ముందుగా మహాత్మాగాంధీ, అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాల వేశారు. అనంతరం మా తెలుగు తల్లికి మల్లెపూ దండ ఆలపించారు. దీక్షలో చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు కళా వెంకట్రావు, దేవినేని ఉమామహేశ్వరరావు, నారా లోకేశ్, కొల్లు రవీంద్ర, ఎంపీలు గల్లా జయదేవ్, కనకమేడల రవీంద్రకుమార్, కేశినేని నాని సహా పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు పావులూరి శివరామకృష్ణ చంద్రబాబుకు నూలుపోగు దండ వేసి అభినందించారు.

### మతపెద్దల ఆశీర్వచనాలతో శ్రీకారం..

ముఖ్యమంత్రి వేదికపైకి రాగానే తితిదే, దుర్గగుడికి చెందిన వేదపండితులు, క్రైస్తవ, ముస్లిం మతపెద్దలు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం పలువురు స్వాతంత్ర్య సమరయోధులు ముఖ్యమంత్రిని ఆశీర్వదించారు. మాజీ సైనికులు ముఖ్యమంత్రిని కలసి సంఘీభావం ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం ఏడింటికి దీక్ష విరమించాక ముఖ్యమంత్రి ప్రసంగిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దీక్షకు సంఘీభావంగా హాజరైన వివిధ పార్టీలు, సంఘాల నాయకులతో మాట్లాడిస్తారు.

విభజన చట్టంలోని అంశాలు, ప్రత్యేక హోదా సహా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు చేస్తున్న పోరాటంలో భాగంగా చంద్రబాబు ఈ దీక్ష చేపట్టారు. ఈ నేపథ్యంలో తన పుట్టినరోజు వేడుకలు నిర్వహించకుండా, దీక్షల ద్వారా అందరూ కేంద్రంపై ధర్మాగ్రహం ప్రకటించాలని ముఖ్యమంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో ఒక

### దీక్ష విరమించిన చంద్రబాబు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన ధర్మపోరాట దీక్ష ముగిసింది. సీఎం చంద్రబాబు ధర్మపోరాట దీక్షను విరమించి విజయ శంఖం పూరించారు. ఇద్దరు చిన్నారులు చంద్రబాబుకు నిమ్మరసం ఇచ్చి నిరశన దీక్షను విరమింపజేశారు. విజయవాడలోని మున్సిపల్ మైదానంలో ఉదయం 7గంటల నుంచి రాత్రి 7గంటల వరకూ చంద్రబాబు ఈ దీక్షలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మంచి నీళ్లు కూడా తీసుకోకుండా దీక్షను కొనసాగించారు. సీఎంతో పాటు 96 ఏళ్ల పావులూరి కృష్ణయ్య కూడా దీక్షలో కూర్చున్నారు. తరువాయి 2లో

నాయకుడు ముఖ్యమంత్రి హోదాలో రాష్ట్రం కోసం పుట్టిన రోజున నిరాహారదీక్ష చేయడం ఇదే ప్రథమం. 68ఏళ్ల వయసులోనూ ముఖ్యమంత్రి చేస్తున్న దీక్షకు వివిధ పార్టీలు, స్వచ్ఛంద, ప్రజాసంఘాలు మద్దతు పలికాయి. ముఖ్యమంత్రికి సంఘీభావంగా తెదేపా శ్రేణులు, వివిధ సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా దీక్షలు నిర్వహిస్తున్నాయి. ఏ జిల్లాకు చెందిన మంత్రుల్ని ఆ జిల్లాలోనే దీక్షల్లో పాల్గొనాల్సిందిగా చంద్రబాబు సూచించారు.

### జనావళికి చంద్రలేఖ...

దీక్ష నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రం పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా, వంచనకు వ్యతిరేకంగా సత్యాగ్రహం చేస్తున్నాను అని అందులో తరువాయి 2లో

# నాకు న్యాయం జరిగే వరకు వెళ్లను

- ఫిలిం ఛాంబర్ వద్ద పవన్ నిరసన
- నిర్మాతల మండలి, మా అసోసియేషన్, మీడియాపై ఆగ్రహం.. సినీప్రముఖుల మద్దతు
- రాంగోపాల్ వర్మ వ్యాఖ్యలకు ఖండన
- వర్మపై చర్యలకు న్యాయవాదులతో చర్చలు



హైదరాబాద్: సినీనటుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఫిలిం ఛాంబర్ వద్ద నిరసన తెలిపారు. పవన్‌తో పాటు ఆయన తల్లి, ఆయన సోదరుడు నాగబాబు, వరుణ్ తేజ్, సాయిధరమ్ తేజ్, అల్లు అరవింద్, అల్లు అర్జున్ శుక్రవారం ఫిలిం ఛాంబర్ తరువాయి 2లో

# చంద్రబాబుది ధర్మదీక్ష కాదు, ఉపవాసమే

## వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే రోజా విమర్శ



హైదరాబాద్ : టీడీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కరోజు దీక్షపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే రోజా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చంద్రబాబు చేస్తున్నది ధర్మ దీక్ష కాదని, కేవలం ఉపవాసం మాత్రమేనని ఆమె అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో ఢిల్లీలో దీక్ష చేసి ఉంటే ఏపీకి ప్రత్యేక హోదా వచ్చేదని రోజా వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో రోజా శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. హోదా కోసం వైఎస్సార్ సీపీ ఎంపీలు... స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామాలు చేసి ఆమరణ దీక్షకు కూర్చుంటే బలవంతంగా ఈ ప్రభుత్వాలు దీక్షను భగ్నం చేశాయి. ఈ రోజు చంద్రబాబు చేస్తున్నది దొంగ దీక్ష. ఇదే దీక్ష ఢిల్లీలో చేసి ఉంటే ఉపయోగం ఉండేది. ఈ దొంగదీక్షకు రూ.30కోట్ల ప్రజాధనం వృధా. టీడీపీ ఎంపీలు రాజీనామా చేయకుండా స్పీకర్ లేని చూసి ...స్పీకర్ ఛాంబర్‌లో దొంగ నాటకాలు ఆడింది టీడీపీ ఎంపీలే.

ఇక చంద్రబాబు ఏడాది తిండి ఖర్చు రూ.8కోట్లు. కేవలం పుల్కాలు, కూరగాయలు తినేవాడికి ఇంత బడ్జెట్ అవసరమా?. సీరియస్‌గా దీక్ష చేయాల్సిందిపోయి ఎన్టీఆర్ డూప్‌లు పెట్టుకుని దీక్షలో కామెడీ చేస్తున్నారు. ఎన్టీఆర్ లాంటి నేతను అవమానపరుస్తున్నారు. ప్రత్యేక హోదాకు సమాధి కట్టి, ప్యాకేజీ అంగీకరించిన చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాలను తరువాయి 2లో



# కాంగ్రెస్‌తో పొత్తు ఉండదు

- బీజేపీని గద్దె దించడమే ప్రధాన లక్ష్యం
- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు ప్రస్తావనే లేదని, అవగాహన కూడా ఉండబోదని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చెప్పారు. మహాసభల రెండోరోజు రాజకీయ తీర్మానంపై చర్చించామని తెలిపారు. సీపీఎం మహాసభల వివరాలను తరువాయి 2లో











# బాలకృష్ణ వ్యాఖ్యలతో ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తోంది

## టీడీపీ కేవలం ఫ్యామిలీ పార్టీ మాత్రమే.. బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు



విశాఖపట్నం : వైఎస్ జగన్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందనే భయం టీడీపీకి పట్టుకుందని బీజేపీ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు అన్నారు. పుట్టిన రోజు నాడైనా చంద్రబాబు నిజాలు మాట్లాడితే బాగుంటుందని ఆయన హితవు పలికారు. శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆనాడు ప్యాకేజీకి ఒప్పుకుంది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే అని ఎమ్మెల్యే మండిపడ్డారు. కొందరి డైరెక్షన్‌లో బాబు నడుస్తున్నారు.. టీడీపీ కేవలం తరువాయి 2లో

# సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పంటల దిగుబడిని పెంచాలి

**- వ్యవసాయ అధికారులు, రైతులకు సూచన - ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధనా డైరెక్టర్ ఎన్.ఎ.నాయుడు**



విశాఖపట్నం: సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పంటల దిగుబడిని పెంచాలని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధనా డైరెక్టర్ ఎన్.ఎ.నాయుడు తెలిపారు. శుక్రవారం ఆంధ్రాయూనివర్శిటీ ప్లాటినమ్ జూబ్లీ గెస్ట్‌హౌస్‌లో జరిగిన ఉత్తర కోస్తా పరిశోధన మరియు విస్తరణ సలహా మండలి సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెండురోజుల పాటు జరిగే ఈ సమావేశంలో ఖరీఫ్ మరియు రబి 2017-18 పరిశోధనా ప్రగతి కార్యక్రమానికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అధికారులు, అభ్యుదయ రైతులు, రైతు మహిళలు పాల్గొని వ్యవసాయంలో చేపడుతున్న పలు అంశాలపై సలహాలు, సూచనలు, అభిప్రాయాలను స్వీకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఇటీవల కాలంలో సూక్ష్మ నీటి వనరుల ద్వారా పంటలను పండించే విధానం తగ్గిందని, ప్రస్తుతం పంటల సాగుతో పాటు సమీకృత వ్యవసాయం, డెయిరీ, పౌల్ట్రీ, తేనేటీగల పెంపకాలను అభివృద్ధి చేయాలన్నారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి కనపరచకపోవడం, ప్రభుత్వ రంగ విధానాలను పెంపొందించుకోవల్సిన అవసరం వుందన్నారు. యాంత్రీకరణ ఉంటేనే వ్యవసాయం అభివృద్ధి చెందుతుందన్నారు. 2017-18లో పంటలు, వాతావరణ పరిస్థితులు, రైతులు, వ్యవసాయ అధికారులు ప్రత్యేక ప్రణాళికను రూపొందించి నూతన పరిశోధనలు ఆవిష్కరించుకోవాలన్నారు. అదేవిధంగా 2018-19 నాటికి క్రాప్ ప్లాన్‌ను రూపొందించుకోవడానికి అవకాశం వుంటుందన్నారు. ఈ సమావేశంలో ఆచార్య ఎన్‌జి.రంగా పరిశోధన మరియు విస్తరణ విశ్వవిద్యాలయాలకు చెందిన ఆచార్యులు డా.పి.రాంబాబు, డా.ఎల్.ఉమాదేవి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన వ్యవసాయశాఖ జెడిలు, ఆత్మా పీడీలు, వ్యవసాయశాఖ మరియు అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నూతన విధానాల వల్ల

## రైల్వే కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు

మాధవధార : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నూతన విధానాల వల్ల రైల్వే కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని శ్రామిక కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పప్పల శ్రీహరి అన్నారు. శుక్రవారం మర్రిపాలెంలో గల ఎలక్ట్రికల్ లోకో షెడ్డు వద్ద ఎన్‌పిఎస్, ఎఫ్‌డిఐలను వ్యతిరేరిస్తు ధర్నా నిర్వహించారు. అదేవిదంగా నూతన పించన్ విధానాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయ్యడం కేంద్ర ప్రభుత్తం దుర్మార్గమని అన్నారు. దీని వలన కార్మికులకు భద్రత కరువుతుందని అన్నారు. ఎఫ్‌డిఐ, పిపిపిల విధానాలను వెనక్కు తీసుకోవాలని అన్నారు. దీని వలన రైల్వే ఉద్యోగులు పిల్లలకు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ బివిఎస్ఎన్.రెడ్డి, కార్యదర్శి నాయక్, ఉపాధ్యాక్షులు రాజశేఖర్, ఆఫిస్ బేరర్లు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని నినాదాలు చేశారు. అనంతరం రైల్వే అధికారికి మోమోరెండం ఇచ్చారు.

## నేడు చోడవరంలో ప్రచార ఐక్యవేదిక సమావేశం

గొలుగొండ : చోడవరం గ్రామంలో జిల్లా ప్రచార ఐక్యవేదిక సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రచార ఐక్యవేదిక అధ్యక్షుడు జక్కు నర్సింహమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చోడవరంలో ప్రేమ సమాజం భవనంలో శనివారం సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివప్రసాదరావు, శీలం నాగార్జున, పుట్టా గంగయ్య హాజరవుతున్నారన్నారు. ఈసమావేశంలో సమాచార కమిషన్ల నియామకం, జిల్లాలో సమాచార హక్కు చట్టం అమలు చేస్తున్న తీరు, అమలుపై చర్చించడం జరుగుతుందన్నారు. కావున జిల్లాలో అన్ని మండలాల నుంచి అధ్యక్ష కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

## వినియోగదారులకు అందుబాటులో ఐటీసీ జ్యూస్ ఉత్పత్తులు

విశాఖపట్నం : వినియోగదారులకు అందుబాటులో ఐటిసి జ్యూస్ ఉత్పత్తులను ప్రవేశపెట్టిందని ఐటిసి ఫుడ్ డివిజనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ హేమంత్ మల్లింక్ అన్నారు. సరాసరి పండ్లు గుజ్జు నుంచి తయారుచేసిన జ్యూసెస్ బేవరేజ్ వినియోగదారులకు ఆహ్లాదాన్ని కలిగించే విధంగా అందించాలన్న లక్ష్యంతో పళ్ల గుజ్జు నుంచి తీసే జ్యూస్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు.



**మద్దిలపాలెం వద్ద చంద్రబాబునాయుడు చేపట్టిన ధర్మపోరాటం దీక్షకు మద్దతుగా తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఒకరోజు దీక్షను చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.**

# ఇద్దరు మిలీషియా సభ్యుల అరెస్టు

కొయ్యూరు : స్థానిక మంప ఎస్సై శ్రీనివాస రావు ఆధ్వర్యంలో శుక్రవారం చీడిపాలెం పంచాయతీ రేవులకోటలో స్థానిక సిబ్బందితో కలిసి కూంబింగ్ నిర్వహిస్తుండగా ముగ్గురు మిలీషియా సభ్యులు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వంతల బాల రాజు(23), జర్త గణేష్(21), జర్త గంగ రాజు(21) అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. మావోయిస్టు మిలిషియా సభ్యులు స్వచ్ఛంధంగా లొంగిపోతే ఎటువంటి కేసులు ఉండవన్నారు. అదే అరెస్టు చేస్తే కేసులతో పాటు జైల్లో ఉండాల్సి వస్తుందన్నారు. కావున మిలీషియా సభ్యులు స్వచ్ఛంధంగా లొంగిపోవాలన్నారు. సంఘ వ్యతిరేక చర్యలకు ఎవరైనా పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

## రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌కు ఘన స్వాగతం

విశాఖపట్నం: జిల్లా పర్యటన నిమిత్తం శుక్రవారం జిల్లాకు విచ్చేసిన గౌరవ రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్.నరసింహన్ మరియు వారి సతీమణికి విమానాశ్రయంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ జి.సృజన, జివియంసి కమిషనర్ హరినారాయణన్, కమిషనర్ ఆఫ్ పోలీస్ డి.యోగానంద్ ఘన స్వాగతం పలికారు. తదుపరి గవర్నర్ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని బస చేశారు.

శనివారం గవర్నర్ జిల్లాలో పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు.



**గ్రేటర్ విశాఖ 15వవార్డు రామాలయం గుడి వద్ద మహిళల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని విశాఖ పార్లమెంట్ సభ్యులు కంభంపాటి హరిబాబు అన్నారు. ఉజ్వల దినోత్సవాన్ని పురస్కరించుకుని ద్వారకా గ్యాస్ ఎజన్సీ ఆధర్యంలో లబ్ధిదారులకు ఉచితంగా వంటగ్యాస్‌ను సిలిండర్‌ను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహిన వర్గాల ప్రజలకు ఈ పథకం ద్వారా అన్ని జిల్లాల్లో తెల్ల రేషన్‌కార్డు కలిగిన ప్రతి వారికి ఈ పథకం ద్వారా ఉచితంగా గ్యాస్‌ను పంపిణి చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా అనేక మంది ప్రజలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. అదేవిదంగా కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు పేద ప్రజలకు ప్రవేశపెట్టిందని వాటిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజక వర్గం శాసనసభ్యులు పి.విష్ణుకుమార్‌రాజు, ద్వారకా గ్యాస్ ఎజన్సీ నిర్వాహకులు కళా శ్రీనువాసరావు, 15వవార్డు అధ్యక్షుడు కారెం మహేష్, 31వ వార్డు బిజెపి అధ్యక్షులు గురువింద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.**

**అక్కయ్యపాలెం ఎన్‌హెచ్-5 రోడ్డులో టీడీపీ నాయకులు బి.రామారావు ఆధ్వర్యంలో ధర్మపోరాట దీక్షను చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.**



# రాష్ట్ర ప్రజలను మోసగించిన కేంద్రం దిగి వచ్చేవరకు పోరాటం ఆగదు

## మంత్రి గంటా శ్రీనివాసరావు



అనకాపల్లి : రాష్ట్ర ప్రజలను కేంద్రం మోసగించిందని....కేంద్రం ప్రత్యేక హోదా విభజన హామీలు నెరవేర్చేవరకు తెలుగుదేశం పార్టీ పోరాటం ఆగదని, మంత్రి గంటా శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూచౌక్ జంక్షన్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాజధానిలో చేపట్టిన ధర్మపోరాట దీక్షకు సంఘీభావంగా జరిగిన నిరాహారదీక్షలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని నమ్మించి మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రానికి కేటాయించాల్సిన నిధులను కేటాయించలేదన్నారు. చంద్రబాబు నాయకత్వంలో అవసరమైతే ఏ స్థాయిలోకి వెళ్లినా పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ పోరాటానికి ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. పుట్టిన రోజును కూడా పక్కన పెట్టి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడమే ధ్యేయంగా 68 ఏళ్ల వయసులో చంద్రబాబు చేస్తున్న పోరాట ప్రతిమను ప్రతీ ఒక్కరూ అభినందించక తప్పదన్నారు. దేశమంతా చంద్రబాబు చేస్తున్న పోరాటం వైపు, దృష్టి సారించారని చెప్పారు. అలాగే అనకాపల్లి శాసన సభ్యులు పీలా గోవిందసత్యనారాయణ మాట్లాడుతూ ప్రత్యేక హోదా ప్రకటించాల్సిందేనని డిమాండ్ చేసారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ప్రతీ ఒక్కరు నిరసన తెలియజేయాలన్నారు. ధర్మ పోరాట దీక్షకు సహకరించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహంవద్ద పార్టీ శ్రేణులతో కలిపి నివాళులు అర్పించారు. క్రిష్టియన్లు, ముస్లిములు, జైన్ హిందూవులతో, మతాలకు అతీతంగా ప్రత్యేక హెూదా ఇవ్వాలని ప్రార్దనలు చేసారు. అనంతరం నెహ్రూచౌక్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ ఆందోళనకు అనకాపల్లి మాజీమున్సిపల్ చైర్మన్ కొణతాల జగన్ కడిమిశెట్టి రాంజీ, మళ్ల సాంబశివరావు సంఘీభావం ప్రకటించారు. ఉద్యోగసంఘాలు, ప్రజా సంఘాలు, డ్వాక్రా సంఘ మహిళలు, జర్నలిస్టు యూనియన్ ప్రతినిధులు ధర్మపోరాట దీక్షకు మద్దతుగా పాల్గొన్నారు. పలువురు విద్యార్దులు, యువకులు, ప్రత్యేక హెూదా వలన జరుగుతున్న నష్టంపై ప్రసంగించారు. పెద్ద ఎత్తున న్యాయం కావాలంటూ నినాదాలు చేసారు. ప్లేకార్డులు ప్రదర్శించారు. కార్యకర్తల నినాదాలతో నెహ్రూచౌక్ జంక్షన్ మారుమ్రోగింది. ట్రాఫిక్ పోలీసులు జనజీవనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. అయితే పట్టణ ప్రజలు ఆర్టీసీ బస్సులను దారి మళ్లించడంతో కొద్దిపాటి ఇబ్బందికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్ఈసిఎస్ చైర్మన్ మలసాల రమణారావు, తెలుగుదేశం పార్టీనాయకులు బుద్ద నాగజగదీశ్వరరావు, కాండ్రేగుల విష్ణుమూర్తి, కాండ్రేగుల సత్యవతి, బిఎస్ఎంకే జోగినాయుడు, డాక్టర్ కెకెవి నారాయణరావు, కొణతాల వెంకటరావు, మళ్ల సురేంద్ర, గుత్తా ప్రభాకరచౌదరి, దంతులూరి రాజాబాబు, కొణతాల రత్నకుమారి, వేగి గోపి, కాండ్రేగుల సతీష్, నియోజకవర్గంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీడీపీ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## బాబు ధర్మాగ్రహం..

పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పోరాటానికి కలసి రావాలని, దీక్షలో పాల్గొనాలని కోరుతూ అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు, సంస్థలకు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి కళావెంకటరావు లేఖలు రాశారు. వైకాపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వామపక్షాలు సహా అన్ని పార్టీలకూ, సంఘాలకు ఈ లేఖలు వెళ్లాయి. ముఖ్య నాయకులకు ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు ఫోన్లుచేసి సమాచారం అందజేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, వాణిజ్య సంఘాలు, ప్రజాసంఘాలు, వివిధ సంస్థలు, యూనియన్లు ముఖ్యమంత్రి దీక్షకు మద్దతు ప్రకటించాయి. రైతులు, ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు పెద్దఎత్తున దీక్షకు హాజరుకానున్నారు.

*జనం తరపున ఉద్యమ శంఖారావం*

నవ్యాంధ్రప్రదేశ్ నమ్మకాన్ని కేంద్రం నట్టేట ముంచింది. ఐదుకోట్ల ప్రజల్ని నిలువునా దగాచేసింది. చెంబుడు నీళ్లు, చారెడు మట్టి మొహాన కొట్టి దారుణంగా అవమానించింది. తెలుగువాడి గుండెను రగిలించింది. ఇలా అందరి ఆక్రోశం, ఆగ్రహం, ఆవేదన తనదిగా భావించి జనం తరపున ముఖ్యమంత్రి ఉద్యమ శంఖం పూరించారు అని సీఎం కార్యాలయం పేర్కొంది. రాష్ట్రం పట్ల కేంద్రం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణితో విసిగిపోయిన ముఖ్యమంత్రి పోరుబాట పట్టారు. కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని తన దీక్ష ద్వారా నిలదీయనున్నారు. షాంఘై కంటే ఆరింతలు, దిల్లీ కంటే రెండింతలు పెద్దగా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కి దగ్గర్లో ధోలేరా నగరాన్ని 2.30లక్షల ఎకరాల్లో నిర్మిస్తానని ఘనంగా ప్రకటిస్తున్న ప్రధానికి మనం 33వేల ఎకరాల్లో రాజధాని నిర్మించుకుంటామంటే అపహాస్యంగా ఉంది. ధోలేరాకు ఇప్పటికే రూ.4,100 కోట్లు ఇచ్చిన కేంద్రం అమరావతిని చిన్నచూపు చూస్తోంది. ఈ వివక్షను దేశమంతటికి అర్థమయ్యేలా చాటి చెప్పేందుకే ముఖ్యమంత్రి దీక్ష చేపడుతున్నారు అని వెల్లడించింది.

భారీ బందోబస్తు..

ధర్మపోరాట దీక్షకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నవ్యాంధ్ర రాజధాని కేంద్రంగా విజయవాడ నగరం ఇందిరాగాంధీ మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దీక్షా ప్రాంగణంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. గురువారం నాడే సభా ప్రాంగణం, దీక్షా స్థలిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశారు.

## నాకు న్యాయం జరిగే వరకు వెళ్లను

వద్దకు చేరుకున్నారు. తన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని మా అసోసియేషన్, నిర్మాతల మండలిని పవన్ ప్రశ్నించారు. శ్రీరెడ్డి వ్యాఖ్యల వెనుక తానున్నానని రామ్‌గోపాల్ వర్మ ప్రకటించడంతో ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై చర్చించారు. తనకు న్యాయం జరిగే వరకు ఫిలిం ఛాంబర్ వదిలి వెళ్లేది లేదని పవన్ స్పష్టం చేశారు. మరోవైపు వర్మపై న్యాయపరంగా ఎలాంటి చర్యలు తీసుకోవచ్చన్న అంశంపై అల్లు అరవింద్, పవన్‌కల్యాణ్ న్యాయవాదులతో చర్చించారు. తన తల్లిపై శ్రీరెడ్డి అనుచిత వ్యాఖ్యలను ఖండించకుండా గంటల పాటు చర్చలు పెట్టి టీఆర్పీ రేటింగుల కోసం కొన్ని ఛానళ్లు పాకులాడుతున్నాయని పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ ఫిలిం ఛాంబర్‌కు వచ్చారని తెలుసుకున్న అభిమానులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకుంటున్నారు. తమ అభిమాన నటుడితో పాటు ఆయన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని, వారి వెనకున్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో ఫిలిం ఛాంబర్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఈ వ్యవహారంలో పలువురు సినీ ప్రముఖులు పవన్‌కు మద్దతు ప్రకటిస్తున్నారు. పవన్‌పై శ్రీరెడ్డి వ్యాఖ్యల వెనుక తానున్నానని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ప్రకటించడంపై మెగా కుటుంబం ఇప్పటికే ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. కాస్టింగ్ కౌచ్ వివాదంలో తనను అనవసరంగా లాగడం, తన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై భావోద్వేగంతో కూడిన ట్వీట్ చేశారు. నాపై ఆరోపణలు చేస్తున్నవారికి, చేయిస్తున్న వారికి అమ్మలు, అక్కలు, కోడళ్లు ఉన్నారు. కానీ వారి ఇంట్లో మహిళలే సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నారు. టీఆర్‌పీలు, రాజకీయ లాభాల కోసం వయసైపోతున్న నా 70 ఏళ్ల తల్లిని దూషిస్తున్నారు. మీరంతా టీఆర్‌పీల కోసం షోలు నిర్వహిస్తున్నారు కదా? మంచిది. వీటన్నింటికంటే మించిన షోను మీకు చూపిస్తాను. నేను నటుడి కంటే ముందు, రాజకీయ నేత కంటే ముందు ఓ అమ్మకు బిడ్డను. ఓ కొడుకుగా నా తల్లి గౌరవాన్ని కాపాడుకోలేకపోతే బతకడం కంటే చావడం మంచిది అంటూ పవన్ చేసిన ట్వీట్ ఆయన మనోవేదనను తెలియజేస్తోంది.

## కాంగ్రెస్‌తో పొత్తు ఉండదు

గురువారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆయన మీడియాకు తెలిపారు. రెండు నెలల కిందటే రాజకీయ తీర్మానాన్ని ప్రతిపాదించామని, కాంగ్రెస్‌తో పొత్తు విషయంలో పార్టీలో భిన్నాభిప్రాయాలు వచ్చాయని తెలిపారు. రాజకీయ తీర్మానంపై అందరి అభిప్రాయాలను స్వీకరించామని తెలిపారు. గతంలో పార్టీపరంగా జరిగిన లోపాలను సరిదిద్దుకుంటామని చెప్పారు. పార్టీలో సీక్రెట్ బ్యాలెట్‌కు ఆస్కారం లేదని, ఎన్నికల్లో ప్రధానంగా కాంగ్రెస్ పార్టీతో అవగాహన ఒప్పందం ఉండబోదని తెలిపారు. బీజేపీని గద్దె దించడమే సీపీఎం ప్రధాన లక్ష్యమని అన్నారు. ఆరెస్సెస్ కనుసన్నల్లో నడుస్తున్న బీజేపీ ప్రభుత్వం నుంచి ప్రజలను విముక్తి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. దీనిపై ఈ మహాసభల్లో చర్చ జరుగుతున్నదని తెలిపారు. తెలుగురాష్ట్రాలకు సంబంధించి విభజన అంశాలు, ప్రత్యేక హోదా విషయంలో పార్టీ సమావేశాల్లో కచ్చితంగా తీర్మానం ఉంటుందని పేర్కొన్నారు.

రాష్ట్రాన్ని విభజించే సమయంలోనే తమ నిర్ణయం చెప్పామని పేర్కొన్నారు. మహాసభల్లో రాజకీయతీర్మానంపై చర్చలో 13 మంది పాల్గొంటున్నారని, శుక్రవారం మధ్యాహ్నం వరకు చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేక రాజకీయ నివేదికపై మహాసభ చర్చిస్తున్నదన్నారు. పార్టీ 21వ మహాసభల్లో తీసుకున్న నిర్ణయాలు ఎంతవరకు అమలయ్యాయి? రాబోయే రోజుల్లో ఎలాంటి పంథా అనుసరించాలి? అనే దానిపై చర్చించనున్నట్టు తెలిపారు. ఏ అంశంపైనైనా అందరి అభిప్రాయాలు తీసుకుని, వాటిపై చర్చించాకే పార్టీ ఓ నిర్ణయానికి వస్తుందే తప్ప ఏకాభిప్రాయం అనేది సీపీఎం చరిత్రలో లేదని సీతారాం ఏచూరి స్పష్టంచేశారు.

## చంద్రబాబుది ధర్మదీక్ష కాదు, ఉపవాసమే

కేంద్రానికి తాకట్టు పెట్టారు. ఎన్టీఆర్‌ను పార్టీ నుంచి వెళ్లగొట్టి పార్టీని, ట్రస్ట్ భవన్‌ను లాక్కుని, ఎంపీలు, ఎమ్మెల్యేలను లాక్కుని...ఆఖరుకు ఎన్టీఆర్ మృతదేహాన్ని కూడా లాక్కున్నారు. ఇప్పుడు ఓట్ల కోసం ఎన్టీఆర్ ఫోటోకు దండ వేసి దండం ఎలా పెడుతున్నారు?. వైఎస్సార్ సీపీ ఎంపీలు ఆమరణ దీక్ష చేస్తే చూపించడానికి ఎల్లో మీడియాకు మనసులేదు. 30కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చుపెట్టి దీక్ష చేస్తుంటే ఎల్లో మీడియా కవరేజ్ చేస్తోంది.

వైఎస్ జగన్...ఎంపీలు రాజీనామా చేస్తారు అని ప్రకటించగానే ప్రత్యేక హోదా అంటూ చంద్రబాబు దొంగ నాటకాలు ఆడుతున్నారు. ఓటుకు కోట్లు కేసులో లాబీయింగ్ కోసమే ఎంపీలు చేత రాజీనామా చేయించడం లేదు. పైసా ఖర్చు లేకుండా ప్రధాని మోదీ దీక్ష చేస్తే ...చంద్రబాబు మాత్రం రూ.30కోట్ల ఖర్చుతో దీక్ష చేశారు. ఇక రూ.200 కోట్లతో ఇల్లు కట్టుకుని దానికి కావాల్సిన బిల్లులన్నీ ప్రభుత్వ ఖజానా నుంచి చెల్లిస్తూ ప్రజా అవసరాలకు మాత్రం డబ్బు లేదంటున్నారు. ఇక ఎమ్మెల్యే బాలకృష్ణ మతి భ్రమించి మాట్లాడుతున్నారు. అని రోజా మండిపడ్డారు.

**'ధర్మపోరాట దీక్ష నవ్వులపాలు' ఎన్.రఘువీరా రెడ్డి**

'రాష్ట్రానికి కేంద్రం చేసిన అన్యాలయాలపై ధర్మపోరాట దీక్ష' అంటూ చంద్రబాబు చేస్తున్న ఒక్కరోజు నిరాహార దీక్ష చూసి జనం నవ్వుకుంటున్నారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్.రఘువీరా రెడ్డి విమర్శించారు. ఇది ప్రజల్ని వంచించడానికి చేస్తున్న 'నయా'వంచక దీక్ష అని పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ టీడీపీపై ధ్వజమెత్తారు.

గతంలో ప్రత్యేక హెూదా అంశంపై అశోక్‌బాబు ఉద్యమం చేస్తే.. ఆ గొప్పదనమంతా చివరికి చంద్రబాబు కొట్టేశారనీ, మరోసారి చంద్రబాబు మోసానికి బలికావద్దని ఆయన సూచించారు. ఇప్పటికైనా టీడీపీ నీచ రాజకీయాల్ని గ్రహించి.. ఉద్యోగులు, విద్యార్థులు, యువకులు చంద్రబాబు ఆడుతున్న మరో? నాటకం చూసి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు.

*దీక్ష విరమించిన చంద్రబాబు ( ఫోటోలు వాడుకోవాలి)*

పావులూరి కృష్ణయ్యకు చంద్రబాబు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప జేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి తెదేపా శ్రేణులతో పాటు వివిధ ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాల నేతలు ధర్మపోరాట దీక్షకు సంఘీభావం తెలిపారు. చంద్రబాబుకు మద్దతుగా రాష్ట్రంలోని 13 జిల్లా కేంద్రాల్లో మంత్రులు, 175 నియోజకవర్గాల్లో తెదేపా నేతలు, కార్యకర్తలు దీక్షలో పాల్గొన్నారు.

## బాలకృష్ణ వ్యాఖ్యలతో ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తోంది

ఫ్యామిలీ పార్టీ మాత్రమే అని బీజేపీ ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. 'బాలకృష్ణ వ్యాఖ్యలతో ఆయన తండ్రి ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తోంది. ఇంట్లో ఇద్దరిని హత్య చేసి.. మాఫీ చేయించిన పెద్దమనిషి బాలకృష్ణ. కుటుంబ పాలన గురించి ఆంధ్రప్రదేశ్‌లో అందరికీ తెలుసు. శుక్రవారం సాయంత్రం (ఏప్రిల్ 20) 7 గంటల్లోగా ప్రధానికి, హిజ్రాలకు బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి. బాలయ్య సినిమాల్లో స్టంట్లు, ఇంటికి వచ్చిన వాళ్లను కాలుస్తారని తెలుసు.. కానీ మిడిమిడి జ్ఞానంతో కూడా మాట్లాడతారని ఇప్పుడే తెలిసింది' అని విష్ణుకుమార్ రాజు విరుచుకుపడ్డారు.

ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయని ఆయన అన్నారు. ఏడాదిలో విశాఖకు కచ్చితంగా రైల్వేజోన్ వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. 2019 ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు విశ్వాసం వ్యక్తం చేశారు.

## విపత్తులు అగ్నిమాపకసేవలపట్ల అవగాహన పెంపొందించుకోవాలి

-జివిఎంసి కమిషనర్ హరినారాయణన్





విశాఖపట్నం : విపత్తులు - అగ్నిమాపక సేవలపట్ల ప్రతిఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ఏ.పి విపత్తులు స్పందన మరియు అగ్నిమాపక సేవలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆర్.కె.బీచ్ వద్ద శుక్రవారం ఆయన తిలకించారు. ప్రజలు విపత్తులు, అగ్ని ప్రమాదాలపై చైతన్య వంతం కావాలని అభిలషించారు. ముందస్తు జాగ్రత్తలతో ఆస్తి, ప్రాణ నష్టాలను నివారించవచ్చునని పేర్కొన్నారు.

ఏప్రిల్ 14 నుండి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ముగింపు దినం 20వ తేది శుక్రవారం ర్యాలీని ప్రారంభించారు.

ర్యాలీలో ఎన్.ఐ.ఎఫ్.యస్, ఐ.ఓ.ఎల్, విపత్తులు-అగ్నిమాపక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'కాస్ట్రో ఆఖరి ప్రయాణం' పుస్తకావిష్కరణ



విశాఖపట్నం : 'ది కాస్ట్రో యెరా' (కాస్ట్రో యుగం) ఆంగ్ల పుస్తకాన్ని కామ్రేడ్ ఎం.ఎ. బేబీ, మాజీ ఎం.పి. మరియు భారత్ - క్యూబా సంఘీభావ కమిటీ ఛైర్మన్ 'సిపిఎం 22వ మహాసభల' సందర్భంగా హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. కామ్రేడ్ వి. శ్రీనివాసరావు (మాజీ ప్రజాశక్తి సంపాదకులు) పుస్తక పరిచయం చేశారు. సిహెచ్. నరసింగరావు 256 పేజీల ఈ ఆంగ్ల పుస్తకాన్ని సంకలనం చేశారు. కామ్రేడ్ ప్రకాశ్ కరత్, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఈ పుస్తకానికి ముందుమాట రాశారు.

కాస్ట్రో మరణించిన తరువాత విడుదలైన పుస్తకం ఇది. కాస్ట్రో ఆఖరి ప్రయాణం పేరుతో సీతారాం ఏచూరి, ప్రకాశ్ కరత్, అరుణ్‌కుమార్ వ్యాసాలు ఈ పుస్తకంలో వున్నాయి. ఇందులో క్యూబా విప్లవం సందర్భంగా ఫైడల్ కాస్ట్రో, చేగువేరాల అత్యంత విలువైన వ్యాసాలు, ఉపన్యాసాలను కూడా పొందుపరిచాము.

2016 మేడే సందర్భంగా సిహెచ్. నరసింగరావు క్యూబా పర్యటన విషయాలను 'మేడే ఉత్సవం', 'క్యూబాలో వైద్యం' అనే వ్యాసాలు రాశారు. అవి ఇందులో ప్రచురించారు. ఈ పుస్తకంలో 1993 విశాఖ పోర్టు నుంచి క్యూబాకు గోధుమలు, మందులు ఒక షిప్ లోడ్ పంపిన సందర్భంగా హవానా పోర్టులో కాస్ట్రో చేసిన ప్రసంగం పొందుపరచబడింది.

## ధర్మపోరాట దీక్ష మద్ధతు

- కేంద్రతీరుకు నిరసన
- హోదాతో పాటు విభజన హామీలూ అమలుపర్చాలి
- 37వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గంకల అప్పారావు




కంచరపాలెం: 37వ వార్డు పరిధిలో గల ఇందిరానగర్-3 గ్రామంలో గల తెలుగు దేశం పార్టీ కార్యాలయం నందు వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంకల అప్పారావు అద్వర్యంలో మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు కేంద్రం తీరుకు నిరసనగా ధర్మ పోరాట దీక్షను చేసారు .ముందుగా స్వర్గీయ అన్న నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు . వార్డులో సైకిల్ ర్యాలీ నిర్వహించారు అనంతరం అయన మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్రం తీరుకు నిరసనగా ధర్మ పోరాట దీక్షకు చేస్తున్నారని సీఎం చంద్రబాబు. ప్రత్యేక హోదాతో పాటూ విభజన హామీల్ని నెరవేర్చాలంటూ... తన పుట్టిన రోజు (శుక్రవారం) విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారని . రాష్ట్రమంతటా కేంద్రం తీరుకు నిరసనగా ధర్మ పోరాట దీక్ష జరుగుతుందని తెలియజేసారు . ఈ కార్యక్రమంలో వార్డు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు , మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .




## కేంద్ర ప్రభుత్వం మోసం చేసింది

**అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు దీక్ష**
**రాబోయే ఎన్నికల్లో ప్రజలు తప్పక బుద్ధి చెబుతారు**
**చంద్రబాబుకు మద్దతుగా నిరాహారదీక్ష**
**మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు**



భీమునిపట్నం : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన ధర్మ పోరాట దీక్షకు మద్దతుగా, గంటా పిలుపు మేరకు తగరపువలస జంక్షన్, పెట్రోల్ బంకు వద్ద భీమిలి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సి.హెచ్ విజయ్ బాబు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు నిరాహారదీక్ష చేపట్టారు. శుక్రవారం ఈ దీక్ష కార్యక్రమం ప్రారంభమయింది.

మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఈ దీక్షలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరాహారదీక్షలో పాల్గొన్న వారికి, సంఘీభావం తెలిపిన వారికి పెరు పేరున ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి మోసం చేసినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కేంద్ర ప్రభుత్వంనకు తగిన బుద్ధి చెపుతారని అన్నారు. చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు చేసుకోకుండా ప్రత్యేక హెూదా కోసం దీక్ష చేయడం అతనికి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కావాలని పట్టుదల ఉందని అన్నారు.

ప్రత్యేక హోదా కోసం సిఎం చంద్రబాబు ఎన్నోసార్లు ఢిల్లీ వెళ్ళినా మోడీ హోదా విషయం చెప్పలేదని అన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో గంటా ప్రతినిధి చిక్కాల. విజయబాబు, భీమిలి ఎంపిపి యరబాల కృష్ణవేణి, అనీల్ ప్రసాద్ ,మార్కెట్ కమిటీ అధ్యక్షులు కోరాడ నాగభూషణ రావు , గిడ్డంగుల శాఖ డైరెక్టర్ మణిశంకర నాయుడు, రూరల్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కురిమిన లీలావతి,, మాజీ చైర్ పర్సన్ కొప్పల ప్రభావతి, పద్మనాభం మండల పార్టీ ప్రెసిడెంట్ కాళ్ళ.నగేష్ ,పద్మనాభం ఎం.పి.పి. కాళ్ళ.పద్మ,అనందపురం ఎం.పి.పి. చెన్నా. వరలక్ష్మి,భీమిలి, తగరపువలస డివిజన్ అధ్యక్షులు గంటా. నూకరాజు, కొప్పలరమేష్,, రూరల్ మండల నాయకులు డి.ఎ.ఎన్. రాజు,మాజీ ఎం.పి.పి.గాడు వెంకటప్పడు, టీడీపీ నాయకులు కోరాడ రాజబాబు, బమ్మిడి సూర్యనారాయణ,,మాజీ కౌన్సిలర్లు, ఎస్సీ సెల్ అధ్యక్షులు రవ్వ వెంకటరావు, జహానారా , బమ్మిడి ఉమా, భీమిలి, పద్మనాభం, ఆనందపురం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అత్యధిక సంఖ్యలో మహిళలు, కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి ఉపాధ్యాయులు, తగరపువలస వర్తక సంఘం, వికలాంగులు సంఘీభావం తెలిపారు.

## ప్రత్యేక హోదా కోసం టీడీపీ పోరాటం ఆపదు



నర్సీపట్నం : ప్రత్యేక హోదా కోసం టీడీపీ పోరాటం ఆపేది లేదని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శుక్రవారం చంద్రబాబు దీక్షకు మద్దతుగా నర్సీపట్నం అబీద్ సెంటర్‌లో మంత్రి అయ్యన్న ఆధ్వర్యంలో దీక్ష చేశారు. ముందుగా ఆయన ఇంటి నుంచి ర్యాలీగా దీక్షా శిబిరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పిందన్నారు. ఇప్పుడు మాట మార్చి మోసం చేయడం మోదీకే దక్కిందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నాయకుడు చంద్రబాబునాయుడు దీక్ష చేయడం, ఆయనకు మద్దతుగా ఇక్కడ దీక్షకు పూనుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసి పాత్రుడు, అయ్యన్న తనయుడు చింతకాయల విజయ్, రాజేష్, నర్సీపట్నం ఎంపిపి సుకల రమణమ్మ, మండల పార్టీ అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ అడిగర్ల అప్పలనాయుడు, నర్సీపట్నం సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌కు కొండకర్ల విద్యార్థులు ఎంపిక



అచ్యుతాపురం: పాటిపల్లిలో ఉన్న ఏపి మోడల్ స్కూల్ నిర్వహించిన 6వతరగతి ప్రవేశ పరీక్షలో తమ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు కొండకర్ల ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రొంగలి రాంబాబు శుక్రవారం తెలిపారు. కోట్ని హరి (6వ ర్యాంక్), కొరుకుండు మహేష్ (36వ ర్యాంకు), గొన్నాబత్తుల కుమార్ (47వ ర్యాంక్)లు ఎంపికైయ్యారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు రొంగలి రాంబాబు, ఉపాధ్యాయుల టి.ఎ.సత్య నారాయణ, వి.హెచ్.నళిని, మారిశెట్టి వెంకట అప్పారావు, కొణతాల సోమశేఖర్, అద్దెపల్లి విజయ్‌లు అభినందించారు.

### అంతర్జాతీయ అకౌంటింగ్స్ కోర్సులపై

## 22న అవగాహనా సదస్సు

సాగర్‌నగర్ : ప్రపంచంలోని వందకు పైగా దేశాలలో గుర్తింపు పొందిన అకౌంటింగ్ కోర్సులపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆద్వర్యంలో ఏప్రిల్ 22వ తేదీన దొండపర్తిలోని గీతం సిటీసెంటర్‌లో అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్టు ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.షీలా తెలిపారు.ఈ సదస్సులో భాగం గా ఇంటర్మీడియిట్ పూర్తి చేసిన విద్యార్థులకు బికామ్ తో పాటు అంతర్జాతీయ అకౌంటింగ్ కోర్సు 'అసోసయేషన్ ఆఫ్ చార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఎసిసిఎ) పై అవగాహన కలిగిస్తాయన్నారు. ఎసిసిఎ అర్హత సాధించిన వారికి ప్రపంచవ్యాప్తంగా 118 దేశాలలో ఉన్నతస్థాయి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. వాణిజ్య నిర్వహణ, చట్టాలు, వృత్తి పరమైన అంశాలపై ఎసిసిఎ శిక్షణ ఉంటుందన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ద్వారా 47 మంది విద్యార్థులు ఇప్పటికే బి.కామ్‌తో పాటు ఎసిసిఎ కోర్సును అభ్యసిస్తున్నారని,త్వరలో పలు వురు విద్యార్థులు ఎసిసిఎ అర్హతాసర్టిఫికేట్‌లను పొందనున్నారని తెలపారు.కాగా ఆదివారం సాయింత్రం 3 గంటలనుంచి దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌లో జరిగే అవగాహన సదస్సుకు ఆసక్తి గల వారు హజరుకావచ్చునన్నారు.


## గీతం రోటరాక్ట్ క్లబ్ వినూత్న సేవ



సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విద్యార్థులు సభ్యులుగా గల గీతం రోటరాక్ట్ క్లబ్ ఆధ్వ ర్యంలో శుక్రవారం వినూత్న సేవా కార్యక్రమాల్ని చేపట్టారు.విశాఖ రైల్వేస్టేషన్ పరిసరాలలో ఫుట్‌పాత్‌లపై నివసిస్తున్న వారిని, సరిఅయిన దుస్తులు లేక తిరుగుతున్న వారిని గర్తించి 500 జతల దుస్తులను, అహరాన్ని అందజేశారు.

మిగిలిన ప్రాంతాలలో ఈ తరహ కార్యక్రమాలను కొనసాగిస్తామని గీతం రోటరాక్ట్‌క్లబ్ ఉపాద్యక్షుడు పి.లోకేష్, సభ్యులు బి.మనోహర్ తెలిపారు.

## ముగిసిన అగ్ని మాపక వారోత్సవాలు



భీమునిపట్నం : భీమిలి మండలం రాజుల తాళ్లవలస గ్రామంలో శుక్రవారం జాతీయ అగ్ని మాపక వారోత్సవాలు ముగింపు కార్యక్రమానికి భీమిలి జోనల్ కమిషనర్ బి.సన్యాసి నాయుడు, దీవిస్ ప్రతినిధి చంద్ర శేఖర్, జిల్లా ఆఫీసర్ ఎన్.సురేంద్ర ఆనంద్, అగ్నిమాపక శాకా అధికారి మదీనా తదితరులు పాల్గొన్నారు. అగ్ని మాపక వారోత్సవాలు ఈ నెల 14 నుండి 20 వరకూ జరిగాయి. ఈ సందర్భంగా భీమిలి జోనల్ కమిషనర్ బి.సన్యాసి నాయుడు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినపుడు అగ్ని మాపక సిబ్బంది తమ ప్రాణాలని లెక్క చేయకుండా ఎంతో శాహసోపెతంగా అ మంటలను అదుపు చేస్తారని, ఎక్కడైనా ప్రమా దం సంభవించిన వెంటనే అగ్ని మాపక సిబ్బంది కి తెలియ జేయాలని అక్కడకి వచ్చిన విద్యార్థులకు ఆయన సూచించారు.

ఇందులో చిట్టి చిట్టి విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు , అగ్ని మాపక సిబ్బంది పాల్గొన్నారు.


## మిలిటరీ ఇంజనీర్ సర్వీసులు
### టెండరు నోటీసు

దిగువ తెలిపిన పనుల కొరకు భారత రాష్ట్రపతి తరపున గ్యారిసన్ ఇంజనీర్ (I) క్యాంప్‌బెల్ బే వారు సింగిల్ స్టేజ్ రెండు కవర్ బిడ్ విధానంలో ఆన్‌లైన్ ఐటంరేట్ బిడ్లు కోరుచున్నారు.

| క్ర. సం. | పనిపేరు | పని అంచనా వ్యయం రూ. లక్షలలో | బయానా రూ. | పూర్తి చేయు కాలం (రోజులలో) | టెండరు ID |
|---|---|---|---|---|---|
| 1 | GE(I) క్యాంప్ బెల్ బే పరిధిలో ICGS కమోర్తా వద్ద జెట్టి దగ్గర ప్రస్తు తమున్న భవనానికి అప్రోచ్ రోడ్ మరియు పుట్ పాత్ ఏర్పాటు చేయుట, ICGS కమోర్తా వద్ద కోస్ట్ గార్డ్ ఏరియాలో ప్రస్తుతమున్న గ్యారేజ్‌కి వెంటి లేషన్‌తో గోడ మరియు కాంక్రీట్ ఫ్లోరింగ్ ఏర్పాటు చేయుట మరియు ICGS కమోర్తా వద్ద జెట్టి దగ్గర CG వసతి వద్ద రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేయుట. | 37.15 లక్షలు | 74,300.00 | 180 | 2018_MES_186388_1 |
| 2 | GE(I) క్యాంప్ బెల్ బే పరిధిలో జెట్టి ICGS కమోర్తా దగ్గర CG వసతి వద్ద బోట్స్‌వెయిన్ స్టోర్ రూమ్ ఏర్పాటు చేయుట జెట్టి ICGS కమోర్తా దగ్గర CG వసతి వద్ద డిజాస్టర్ రిలీఫ్ మెటీరియల్ కొరకు స్టోర్ రూము ఏర్పాటు చేయుట. జెట్టి ICGS కమోర్తా దగ్గర CG ల్యాండ్ వద్ద మెయిన్ గేట్ మరియు వాటర్ టవర్ (సీవార్డ్) వద్ద సెంట్రీపోస్ట్ ఏర్పాటు చేయుట. | 39.60 లక్షలు | 79,200.00 | 180 | 2018_MES_186394_1 |
| 3 | GE (I) క్యాంప్ బెల్ బే పరిధిలో కేటింగ్ పాయింట్ రాడార్ స్టేషన్ కార్‌నికోబార్ వద్ద 01 డీజిల్ జెనరేటర్ సెట్ కొరకు కవర్డ్ వెదర్ ప్రొటెక్టింగ్ షెల్టర్/ షెడ్ ఏర్పాటు చేయుట మరియు ICGS కమోర్తా వద్ద CG ఇన్ లివింగ్ అకామడేషన్ కొరకు శబ్దం లేని 62.5 KVA జెనరేటర్ సెట్ ఏర్పాటు చేయుట. | 28.58 లక్షలు | 57,160.00 | 180 | 2018_MES_186400_1 |
| 4 | GE(I) క్యాంప్ బెల్ బే పరిధిలో LAL టెక్రి, CGDHQ-10, క్యాంప్ బెల్ బే వద్ద SOs/NVKs ఇన్ లివింగ్ బ్లాక్ ఎదురుగా సీవేజ్ పిట్, డ్రెయిన్ మరియు సీవేజ్ డిస్పోజల్ ఏర్పాటు చేయుట మరియు CGDHQ-10, క్యాంప్ బెల్ బే వద్ద CGOM & షిప్స్ గ్యాలరీ వద్ద మాడ్యులర్ స్టోరేజ్ స్పేస్ (మాడ్యులార్ కిచెన్) ఏర్పాటు చేయుట. | 27.73 లక్షలు | 55,460.00 | 180 | 2018_MES_186409_1 |

తదుపరి వివరాల కొరకు వెబ్‌సైట్: **www.defproc.gov.in** చూడండి.

గమనిక: వార్తాపత్రికలలో ప్రచురించబడిన విధంగా బిడ్ కోరుతూ ప్రకటన టెండరు ప్రకటన/బిడ్ డాక్యుమెంట్లలో భాగంగా ఉండదు.

సం/- (ఎస్. తంగరాజ్)
JE (QS & C)
Offg AGE (కాంట్రాక్ట్)
గ్యారిసన్ ఇంజనీర్ తరఫున

davp 10102/11/0141/1819

# విజయభాను సంపాదకీయం

## ఆవిరౌతున్న ప్రజాప్రభుత్వాలు

పాకిస్థాన్‌లో ప్రజా ప్రభుత్వం నిలదొక్కుకుంటున్నదన్న ఆశలు మరోసారి ఆవిరైపోయాయి. ప్రజా ప్రభుత్వం ఉండగానే న్యాయస్థానం సహకారంతో సైన్యం పట్టుబిగించింది. దేశాధ్యక్షుడిగా ఉన్న నవాజ్ షరీఫ్‌ను న్యాయస్థానం పదవీ భ్రష్టుడి చేసిన నాటినుంచి సైన్యానికి ఎదురు లేకుండా పోయింది. ప్రజా ప్రభుత్వం ఉండగానే సైన్యం పరిపాలించడం ఒక విచిత్ర పరిస్థితి! పాకిస్థాన్‌లో పౌర పాలన ముసుగులో ఎంత భయానక సైనికపాలన సాగుతున్నదో పత్రికల పరిస్థితిని చూస్తే అర్థమవుతుంది. పాకిస్థాన్‌లో విశేష ప్రాచుర్యం గల జియో టీవీ ప్రసారాలు కొన్ని వారాలపాటు నిలిచిపోయాయి. ఎందుకు నిలిచిపోయాయనేది ఎవరూ చెప్పలేని దుస్థితి. జియో టీవీ తన రాజకీయ వైఖరిని మార్చుకుంటామని హామీ ఇచ్చిన తర్వాత ప్రసారాలు మళ్ళా ప్రారంభమయ్యాయి. జియో టీవీ ఉదంతం తర్వాత మిగతా టీవీ చానెల్స్ అన్నీ పోటీపడినట్టుగా సైనిక పాలనకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి. నవాజ్ షరీఫ్‌కు వ్యతిరేకంగా వార్తలు అన్ని చానెల్స్‌ను ముంచెత్తుతున్నాయి. నిషేధం విధిస్తున్నామనే అధికార ప్రకటన ఎక్కడా కనిపించదు. కానీ గుట్టుచప్పుడు కాకుండా అమలవుతుంది. ఈ నిషేధాలపై బహిరంగ చర్చ కూడా సాగదు. సైనిక పాలనకు తట్టుకోలేని పాత్రికేయులు దేశం విడిచి వెళ్ళిపోతున్నారు. ఇటీవల సైన్యాన్ని తరచూ విమర్శించే తాహ సిద్ధిఖి అనే పాత్రికేయుడిని నడిరోడ్డున అపహరించే ప్రయ త్నం జరిగింది. దీంతో అతడు తప్పించుకొని ప్యారిస్‌కు చేరుకున్నాడు. ఇటీవల మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ న్యాయస్థానాన్ని విమర్శిస్తే, ఏ చానల్ కూడా ప్రసారం చేయలేదు. సైనిక పాలన ప్రారంభమైన తర్వాత దేశమంతటా అణచివేత తీవ్రమైంది. సైన్యం అణచివేతకు నిరసనగా పష్టూన్ జాతి వారు నిరసనలు చేపట్టారు. కానీ ఈ నిరసన వార్తలను టీవీ చానెల్స్ ప్రసారం చేయలేదు. పాకిస్థాన్‌లో ప్రజా ప్రభుత్వాన్ని బలహీనపరిచి, సైన్యం పాత్రను పెంచడంలో న్యాయస్థానం కీలకపాత్ర పోషిస్తున్నది. సైనిక పాలకుల మెప్పు పొందడానికి నవాజ్ షరీఫ్‌ను పనామా పేపర్స్ కేసులో తప్పుపట్టి పదవీ భ్రష్టుడిని చేసింది. ఆ తర్వాత అతడు అధికారపక్షం (పాకిస్థాన్ ముస్లిం లీగ్- నవాజ్) సారథ్య బాధ్యతలు చేపట్టకూడదని మరో వింత తీర్పు ఇచ్చింది. అది చాలదన్నట్టు నవాజ్ షరీఫ్ జీవిత కాలమంతా పదవులు చేపట్టడానికి అనర్హుడంటూ ఈ నెల పదమూడవ తేదీన తీర్పు ఇచ్చింది. షరీఫ్ ముగ్గురు పిల్లలపై కూడా క్రిమినల్ కేసులు ఉన్నాయి. సుప్రీంకోర్టు నవాజ్ షరీఫ్‌కు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చినట్టు పైకి కనిపిస్తున్నది. కానీ న్యాయస్థానం అనుసరిస్తున్న విధానం వల్ల మొత్తం రాజకీయ వ్యవస్థనే బలహీనపడి, సైన్యం పాలక వ్యవస్థగా మారిపోయింది. పాకిస్థాన్ రాజకీయాలలో షరీఫ్ బలమైన నాయకు డు. ఇప్పటికీ ప్రజాస్వామ్య శక్తులకు ఆయన కేంద్ర బిందువుగా ఉన్నాడు. వచ్చే జూలై పదిహేనవ తేదీన పాకిస్థాన్ పార్లమెంటుకు ఎన్నిక లు జరుగవలసి ఉంది. కానీ ప్రజాస్వామిక దేశాలతో పోలిస్తే, పాకిస్థాన్‌లో ఎన్నికలు ఎంత గొప్పగా సాగుతాయో తెలిసిందే. కానీ ఈ సారి ఎన్నికలు ఆ నామమాత్రపు స్వేచ్ఛలోనైనా జరుగుతాయా అనేది అనుమానమే. పాకిస్థాన్ మాజీ అధ్యక్షుడు నవాజ్ షరీఫ్ లండన్‌లో క్యాన్సర్‌కు చికిత్స పొందుతున్న తన భార్యను చూడటానికి పయనమైపోతున్నారు. ఆయన ఒక అవినీతి కేసులో ఈ నెల 21వ తేదీన న్యాయస్థానం ముందు హాజరు కావలసి ఉన్నది. కానీ షరీఫ్ దేశం విడిచి పరారయ్యే ఆలోచనలో ఉన్నాడనే వార్తలు గుప్పుమన్నాయి. కానీ షరీఫ్ తాను పారిపోయే మనిషికి కాదని స్పష్టం చేశారు. గతంలో కూడా షరీఫ్‌ను బలవంతంగా ప్రవాసం పోయేలా సైన్యం ఒత్తిడి చేసింది. కానీ షరీ ఫ్ అదను చూసుకొని దేశంలో మళ్ళా అడుగుపెట్టి క్రమంగా అధికార పీఠాన్ని చేజిక్కించుకున్నా రు. పాకిస్థాన్ రాజకీయాలకు షరీఫ్ కేంద్ర బిందువు కనుక ఆయనను తప్పించడమే లక్ష్యంగా కుట్ర సాగుతున్నది. ఎన్నికలు జరిగేనాటికి షరీఫ్‌పై కేసులన్నీ విచారించి, ఆయనను జైలులోకి తోస్తారనే ప్రచారం జోరుగా సాగుతున్నది. పదవీచ్యుతుడు అయిన తర్వాత షరీఫ్ దేశవ్యాప్తంగా తిరుగుతున్నారు. ఆయన సభలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నది. తమ పార్టీ వచ్చే ఎన్నికలలో గెలిస్తే పంజాబ్ ముఖ్యమంత్రిగా ఉన్న తన సోదరుడు షహబాజ్ షరీఫ్ ప్రధాని అవుతాడని నవాజ్ షరీఫ్ ప్రకటించాడు. అయితే సైన్యం ఎట్టిపరిస్థితుల్లోనూ పాకిస్థాన్ ముస్లిం లీగ్ (నవాజ్)ను అధికారం చేపట్టనీయదని పరిశీలకులు భావిస్తున్నారు. న్యాయస్థానాన్ని కీలుబొమ్మను చేసుకొని, దేశాధ్యక్షుడినే గద్దెదించిన సైన్యం మళ్ళా షరీఫ్ పార్టీని గెలిచి అధికారం చేపట్టడానికి అవకాశం ఇస్తుందా అనేది అనుమానమే. ఎన్నికల తంతు ముగించి, తన కీలుబొమ్మలను అధికారపీఠంపై కూర్చుండబెట్టిన తర్వాత, సైన్యం మరింత విచ్చలవిడిగా ప్రవర్తించవచ్చు.

## జమ్ముూలో ఉగ్రవాదుల భారీ డంప్ స్వాధీనం

శ్రీనగర్: జమ్మూలోని దోడా జిల్లాలో ఉగ్రవాదులకు చెందిన ఆయుధాలు, మందుగుండు సామగ్రితో కూడిన భారీ డంప్‌ను సైన్యం స్వాధీనం చేసుకుంది. అందులో ఏకే 46, ఏకే 56 రైఫిళ్లు, 289 రౌండ్ల మందుగుండు సామగ్రి హిజ్బుల్ ముజాహిద్దీన్‌కు చెందిన సాహిత్యం, తదితరాలు ఉన్నాయి.

దోడా జిల్లాలో ఉగ్రవాదుల కదలికలు పెరిగినట్లు నిఘా వర్గాల సమాచారం మేరకు పోలీసులు, భద్రతా దళాలు సంయుక్తంగా సోదాలు నిర్వహిస్తుండగా... దెస్సా జిల్లాలోని మజ్మి ప్రాంతంలో భారీ డంప్ బయటపడినట్లు సైనిక అధికారులు తెలిపారు. జమ్మూ ప్రాంతంలో ఇంత పెద్దమొత్తంలో ఉగ్రవాదుల డంప్ బయటపడడం ఇదే మొదటిసారి అని, ముష్కరుల కదలికలకు ఇదే సంకేతమని చెప్పారు.

## కుమారస్వామి నామినేషన్ దాఖలు



బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల వేడి వరుస నామినేషన్లతో ఊపందుకుంది. పలువురు ప్రముఖులు నామినేషన్లు వేశారు. జనతాదళ్ (సెక్యులర్) నేత హెచ్.డి.కుమారస్వామి రెండు చోట్ల పోటీ చేస్తున్నారు. రామనగర, చన్నపట్న నియోజకవర్గాల నుంచి ఆయన పోటీ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన నామినేషన్ పత్రాలను ఆయన రిటర్నింగ్ అధికారికి అందజేశారు. అంతకుముందు, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చాముండేశ్వరి నియోజకవర్గం నుంచి నామినేషన్ వేశారు. బీటీఎం లేఔట్ నియోజవర్గం నుంచి పోటీ చేస్తున్న కర్ణాటక హోం మంత్రి రామలింగా రెడ్డి సైతం నామినేషన్ వేశారు. లోక్‌సభలో కాంగ్రెస్ విపక్ష నేత మల్లికార్జున ఖర్జే తనయుడు ప్రియాంక్ ఖర్గే కాంగ్రెస్ అభ్యర్థిగా చిట్టపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు నామినేషన్ వేశారు. మే 12న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనుండగా, 15న ఫలితాలు వెలువడుతాయి.

## కుట్ర బయటపెడతాం.. : జనసేన అధికార ప్రతినిధి



హైదరాబాద్: గత నెలరోజులుగా సినీ ఇండస్ట్రీలో, తెలుగు రాష్ట్రాల్లో నెలకొన్న పరిణామాలపై జనసేన అధికార ప్రతినిధి అద్దేపల్లి శ్రీధర్ మీడియాతో మాట్లాడారు. కుట్రపూరితంగా వెనకనుంచి నడుపుతున్న వారి బాగోతాలు బట్టబయలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఇవాళ ఫిల్మ్ చాంబర్‌లో ఆయన మాట్లాడుతూ.. కుట్రను కచ్చితంగా బయటపెడతాం. ఇది ఇక్కడితో ఆగదు. టైం వచ్చినప్పుడు ఆధారాలన్నీ బయటపెడతాం. ప్రస్తుతం ప్రముఖులందరితో మా అధినేత పవన్ చర్చలు జరుపుతున్నారు. సినీ ఇండస్ట్రీలో జరుగుతున్న వ్యవహారాలన్నింటిపైనా చర్చలు జరుగుతున్నాయి.

తెలుగు ఇండస్ట్రీని దెబ్బతీయడానికి ఇలా జరుగుతోందా?.. లేదా ఒక వ్యక్తిని దెబ్బతీయడానికి ఇలా చేస్తున్నారా?. తెలుగు రాష్ట్రాల్లో అసలేం జరుగుతోందనే దానిపై చర్చిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో, సినీ ఇండస్ట్రీలో జరుగుతున్న విషయాలపై పవన్ తల్లికి ఏమైనా సంబంధముందా?. అసలు ఆమెను టార్గెట్ చేయడానికి ఎవరికి హక్కుంది?. ఇవాళ పవన్ మదర్ని అన్నది.. రేపొద్దున ఇంకొకర్ని అంటుంది (శ్రీరెడ్డి వ్యాఖ్యలపై స్పందిస్తూ) శ్రీధర్ చెప్పుకొచ్చారు.

## బీజేపీ మాజీ మంత్రికి హైకోర్టులో గొప్ప ఊరట

అహ్మదాబాద్ : బీజేపీ నేత మాయా కొద్నానీకి గుజరాత్ హైకోర్టులో గొప్ప ఊరట లభించింది. గుజరాత్‌లోని నరోదా పాటియాలో 2002లో జరిగిన అల్లర్ల కేసులో ఆమె నిర్దోషి అని హైకోర్టు తీర్పు చెప్పింది. ఇదే కేసులో మరో నిందితుడు, బజరంగ్ దళ్ నేత బాబు బజరంగి దోషి అని పేర్కొంది. మాయా కొద్నానీ, గణపత్ చారా, హరేశ్ చారాలపై ఆరోపణలు రుజువు కాలేదని స్పష్టం చేసింది.

గోద్రా రైల్వే స్టేషన్‌లో 2002 ఫిబ్రవరి 27న సబర్మతి ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్-6 బోగీని గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. ఈ దుర్ఘటనలో 58 మంది కర సేవకులు మరణించారు. ఈ నేపథ్యంలో నరోదా పాటియాలో జరిగిన అల్లర్లలో 97 మంది మరణించారు.

ఈ కేసులో జస్టిస్ హర్ష దేవానీ, జస్టిస్ ఏ ఎస్ సుపేహియా ధర్మాసనం 2017 ఆగస్టులో విచారణను పూర్తి చేసి, తీర్పును వాయిదా వేసింది.

నరోదా పాటియా అల్లర్ల కేసులో స్పెషల్ కోర్టు తీర్పు 2012లో వెలువడింది. 32 మందికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పింది. అప్పట్లో నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా ఉండేవారు. ఆయన మంత్రివర్గంలో మాయా కొద్నానీ కూడా మంత్రిగా పని చేశారు. ఆమె నరోదా పాటియా ఎమ్మెల్యే కూడా. ఆమెకు స్పెషల్ కోర్టు 28 ఏళ్ళ జైలు శిక్ష విధించింది. ఆమె 2009లో తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ తీర్పుపై అపీలుపై గుజరాత్ హైకోర్టు విచారణ జరిపింది. బాబు బజరంగి మరణించే వరకు జైలు శిక్ష అనుభవించాలని పేర్కొంది. ఏడుగురికి 21 ఏళ్ళ జైలు శిక్ష, మిగిలినవారికి 14 ఏళ్ళ సాధారణ జీవిత ఖైదు విధించింది.

## ఒక్కసారిగా పడిపోయిన బంగారం

న్యూఢిల్లీ : మూడు రోజుల నుంచి పెరుగుతూ వస్తున్న బంగారం ధరలు ఒక్కసారిగా కిందకి పడిపోయాయి. బంగారం 240 రూపాయల మేర కిందకి పడిపోయింది. దీంతో నేటి బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ.32,390గా రికార్డైంది. గ్లోబల్‌గా వస్తున్న బలహీనమైన సంకేతాలు, స్థానిక జువెలర్ల నుంచి డిమాండ్ అంతగా లేకపోవడం బంగారం ధరల తగ్గుదలకు కారణమైంది.

కాయిన్ తయారీదారులు, పారిశ్రామిక యూనిట్ల నుంచి వెండికి కూడా డిమాండ్ తగ్గడంతో, వెండి ధరలు సైతం 180 రూపాయిలు క్షీణించాయి.

దీంతో కేజీ వెండి ధర మార్కెట్‌లో రూ.41,300గా ఉంది. గ్లోబల్‌గా బంగారం ధరలు 0.28 శాతం తగ్గి ఔన్స్‌కు 1,341.50 డాలర్లుగా నమోదైంది.

వెండి 0.75 శాతం తగ్గి ఔన్స్ 17.09 డాలర్లుగా ఉంది. దేశ రాజధానిలో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధరలు రూ.240 చొప్పున పెరిగి రూ.32,390గా, రూ.32,240గా రికార్డయ్యాయి. గత మూడు రోజుల నుంచి బంగారం ధరలు రూ.630 మేర పెరిగిన సంగతి తెలిసిందే.

## కవి సమయం

### 'నిర్భయ'

ఉర, ఉర, ఉర అయ్యాడు
ఉరికి బలియైయ్యాడు
ఉసురు పోసుకున్నడు
నా ప్రాణం తిన్నడు
ప్రేమించానంటూ; అడ్డదారి కాసాడు
తిరిగి ప్రేమించలేదు నేనంటేను
యాసిడ్ దాడులు చేశాడు
నా ప్రాణము గాలిలో కల్పాడు
ఎం కీర్తి పొందాడు
ఆ, దుర్మాగుడు - కామాంధుడు ...॥ఉర॥
ఆ, దుర్మాగులు - కామాంధులకు
ఉరి తీసినా! తప్పు లేదంటాను
నేను వినలేకపోయినా!... కనలేకపోయినా!
నా ఆత్మకి శాంతి చెందాలంటే;
ఉరి తీయ్యి వల్సిందే అంటాను ...॥ఉర॥
భావితరాలకు ఇలాంటి వాళ్లు
తారాస పడకూడదంటే;
ఉరియె మార్గం
నిర్భయంగా ఆడపిల్ల అర్థరాత్రి
క్షేమముగా ఇంటికి చేరిన నాడే!
స్త్రీకి నిజమైన స్వతంత్రం వచ్చిందనుకో!
ప్రేమ విలువ తెల్సిన వారేవరైనా!
యాసిడ్ దాడులు చేస్తారా!
ఆ, దుర్మాగులకు శిక్షలు - జరిమానాలు విధించి - విడ్డిపెడితే;
వీధిలో ఇలాంటివాళ్లు పుట్టుకొస్తునే ఉంటే...
స్త్రీకి నిర్భయం ఉండేదెప్పుడు? ...॥ఉర॥

...కవితా రచన
యల్.సిద్ధూ
సెల్ నెం:7702977293


## పంచాంగం


మాసం : ఛైత్ర ; తిథి : షష్ఠి రా.8.49; ఆరుద్ర రా.10.02; ఉ.వ.7.27ల 8.57.

శనివారం 21-04-2018

a మేషం : రుణం ఏ కొంతైనా తీర్చాలన్న మీ లక్ష్యం నెరవేరుతుంది. దీర్ఘ కాలంగా వాయిదా పడుతూ వస్తున్న పనులు పూర్తవుతాయి. ఆది, సోమవారాల్లో కుటుంబీకులతో కలహాలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది. b వృషభం : మీ వ్యక్తిగత విషయాలు ఇతరుల ముందుకు ఏకరువు పెట్టడం మంచిది కాదని గమనించండి. వివాహ, ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి. కాంట్రాక్టు సంబంధించిన వ్యవహారాల్లో పునరాలోచన అవసరం. బంధువులతో చిన్న చిన్న కలహాలు జరిగే ఆస్కారం ఉంది. c మిథునం : ప్రైవేటు సంస్థల్లోని వారికి నిరుత్సాహం తప్పదు. హోటల్, తినుబండారాలు, క్యాటరింగ్, వృత్తుల వారికి పురోభివృద్ధి. విద్యార్థులకు క్రీడ, కళారంగాల్లో మంచి గుర్తింపు లభిస్తుంది. చిట్స్, ఫైనాన్స్ రంగాల వారికి ఒత్తిడి తప్పదు. d కర్కాటకం : రావలసిన ధనం కోసం శ్రమాధిక్యత, ప్రయా సలు తప్పవు. గృహ మరమ్మతులు, మార్పులు అనుకూలిస్తాయి. భాగస్వామిక వ్యాపారాల్లో కష్టనష్టాలు ఎదుర్కోవలసి వస్తుంది. నిరుద్యోగుల యత్నాలు నెరవేరగలవు. e సింహం : మీ కుటుంబీకుల ఆరోగ్యం విషయంలో మెలకువ అవసరం. మీ వాహనం ఇతరులకు ఇవ్వటం వల్ల ఇబ్బందులకు గురికాక తప్పదు. చీటికి, మాటికి ఎదుటివారిపై అసహనం ప్రదర్శిస్తారు. f కన్య :రావలసిన పత్రాలు చేతి కందుతాయి. వ్యవసాయ రంగాల వారికి ఆశాజనకం. ఆడంబరాలకు, విలా సాలకు ధనం విరివిగా వ్యయం చేస్తారు. కుటుంబీకుల ఆరోగ్యంలో జాగ్రత్త అవసరం. క్రీడలపట్ల ఆసక్తి పెరుగు తుంది. విదేశాలు వెళ్లేందుకు చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. g తుల : దైవ కార్య క్రమాల పట్ల ఏకాగ్రత వహిం చలేరు. నూతన పరిచయాలు ఎడబాటు, ఇతర్రతా చికాకులు అధికమవుతాయి. ఇంజినీరింగ్, మెడికల్, శాస్త్ర రంగాల వారికి గుర్తింపు లభిస్తుంది. నూతన ప్రయాణాలు, తీర్థయాత్రలు అను కూలిస్తాయి. h వృశ్చికం :ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుంది. నూతన వ్యాపారాలు ప్రగతి పథంలో సాగుతాయి. పెద్దల మాటల పెడచెవిన పెట్టి ఇబ్బం దులకు గురికాకండి. దూర ప్రయాణాలు, తీర్థ యాత్రలు అనుకూలిస్తాయి. బంధువుల మధ్య సయోధ్య లోపిస్తుంది. i ధనుస్సు : ప్రముఖుల కలయిక వాయిదా పడుతుంది. ఐరన్, సిమెంట్, కలప వ్యాపారస్తులకు పురోభివృద్ధి. స్త్రీలకు పనివారితో సమస్యలు తలెత్తు తాయి. విద్యార్థినులకు ప్రేమ వ్యవ హా రాల్లో ఆశా భంగం తప్పదు. బహుమతులు అందజేస్తారు. j మకరం : ఎరు వులు, క్రిమి సంహారక మందులు, రసాయన సుగంధ ద్రవ్య వ్యాపారస్తులకు అనుకూలమైన కాలం. ధనం విరివిగా వ్యయం చేస్తారు. ఉద్యోగస్తులకు అది ,కారులతో ఏకీభావం కుదరదు. వైద్యరంగాల్లోని వారికి శస్త్రచికిత్సల సమయంలో ఏకాగ్రత అవసరం. k కుంభం : వస్త్ర, బంగారు, వెండి, లోహ వ్యాపారస్తులకు పురోభివృద్ధి. గృహంలో మార్పులు, చేర్పులు చేస్తారు. ఆత్మీయులతో ఉల్లాసంగా గడుపుతారు. మీ కార్యక్రమాలు, పనులు వాయిదా పడతాయి. అకాల భోజనం వల్ల ఆరోగ్యంలో చికాకులు తప్పవు. L .మీనం : ప్రియతములలో ఒకరికి వీడ్కోలు పలుకుతారు. కాంట్రాక్టర్లకు నూతన ఒప్పందాలు అనుకూలిస్తాయి. ఆర్థిక లావాదేవీలు సామాన్యంగా ఉంటాయి. స్త్రీలకు తల కళ్లు నరాలకు సంబంధించిన చికాకులు అధికమవుతాయి.

# సౌరాష్ట్రే సోమనాథంచ..





పరమశివుని ద్వాదశ జ్యోతిర్లింగాలలో ప్రథమస్థానంలో వున్న సోమనాథక్షేత్రం గుజరాత్‌లో వుంది. లయకారకుడు జ్యోతిర్లింగ ఆకారంలో భక్తులకు యుగయుగాల నుంచి దర్శనమిస్తూ అభయమిస్తున్నారు. అనేక దండయాత్రలకు గురైనప్పటికీ తిరిగి పునర్ నిర్మితమైన క్షేత్రమది. సిరిసంపదలతో వున్న ఈ క్షేత్రంపైకి అనేక మంది విదేశీపాలకులు దండయాత్రలు చేశారు. చంద్రునికి శాపవిముక్తి జరిగిన క్షేత్రం కాబట్టి సోమనాథక్షేత్రంగా పేరొందింది. దక్షప్రజాపతి తన 27 కుమార్తెలను చంద్రునికిచ్చి వివాహం చేశాడు. అయితే చంద్రుడు రోహిణితో మాత్రమే సఖ్యంగా వున్నాడని మిగిలిన భార్యలు తమ తండ్రికైన దక్షప్రజాపతికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహం చెందిన ఆయన చంద్రుడు క్షయవ్యాధితో బాధపడాలని శాప మిచ్చాడు. దీంతో భూలోకంపై వచ్చిన చంద్రుడు ప్రస్తుత క్షేత్రమున్న ప్రాంతంలో శివ విగ్రహాన్ని ప్రతిష్టించి తపస్సు చేశాడు. తపస్సుకు మెచ్చిన పరమేశ్వరుడు ప్రత్యక్షమై శాపం నుంచి విముక్తి కలిగించాడు. 27 సతీమణులను సరిసమానంగా చూసుకోవాలని చంద్రునికి హితవు పలికాడు. చంద్రునికి శాపవిముక్తి జరిగిన ప్రదేశం కాబట్టి సోమనాథక్షేత్రంగా పేరొచ్చింది.

చంద్రుడికి ఈ క్షేత్రంలో శాపవిముక్తి కలిగింది. దీంతో ఆయన పరమానందభరితుడై బంగా రంతో ఆలయం నిర్మించినట్టు తెలుస్తోంది. అనంతరం రావణా సురుడు వెండితో ఆలయాన్ని నిర్మించ గా, ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు చందనపు చెక్కలతో నూతన ఆలయాన్ని నిర్మించి నట్టు పురాణాలు పేర్కొం టున్నాయి. శివపురాణం, నంది పురాణంలో పరమేశ్వ రుడు ఇలా పేర్కొం టాడు. 'అన్ని చోట్ల నేనుంటాను. పన్నెండు ప్రదే శాల్లో మాత్రం మరింత ప్రభావ వంతంగా వుంటాను' ఈ పన్నెండు ప్రదేశాలనే ద్వాదశ జ్యోతిర్లింగాలు అని పిలుస్తారు. సాక్షాత్తు ఆ లయకారకుడు ప్రత్యక్షంగా ఈ క్షేత్రాల్లో కొలువైవున్నాడు.

అందుకనే ఈ క్షేత్రాలు పరమపవిత్రమైనవి. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల్లో గుజరాత్‌లోని సోమనాథ ఆలయం మొదటిది. అందుకనే ఇది మహిమాన్విత క్షేత్రమైంది. సోమనాథ క్షేత్రంలో భారీ సంపద వుండటంతో అనేకసార్లు దండ యాత్రలకు గురైంది. క్రీ.శ. 1024లో గజనీ పాలకుడ్కైన మహమ్మద్ చేసిన దండయాత్రలో ఆలయం తీవ్ర నష్టానికి గురైంది. ఆ సమయం లోనే ఆలయం నుంచి ఎక్కువ సంపదను గజనీకి తరలించినట్టు చారిత్రక గ్రంథాలు వెల్లడిస్తున్నాయి. అనంతరం స్థానిక పాలకులు తిరిగి నిర్మించారు. ఢిల్లీ పాలకుడ్కైన అల్లావుద్దీన్ ఖిల్జీ, మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్ పాలనలోనూ ఆలయంపై దాడులు జరిగాయి. జునాగఢ్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన తరువాత ఉక్కుమనిషి, భారతదేశ ప్రథమ హోంమంత్రి వల్లభాయ్‌పటేల్ ఆలయాన్ని సందర్శించి పునర్ నిర్మాణానికి ఆదేశాలిచ్చారు. 1951లో నూతన ఆలయ నిర్మాణం పూర్తయింది. భారత దేశ రాష్ట్రపతి బాబురాజేంద్రప్రసాద్ ఆలయాన్ని ప్రారం భించారు.

ఆలయాన్ని తిరిగి నిర్మించేందుకు నిధుల సేకరణ చేయకుండా కేవలం భక్తులు ఇచ్చిన విరాళాలతో నిర్మించడం విశేషం. యుగయుగాలుగా భక్తుల కోసం కొలువైవున్న సోమనాథమూర్తి తన దివ్యశక్తితో అందరిని ఆశీర్వదిస్తుంటారు.

**సౌరాష్ట్రే సోమనాథంచ...**

ద్వాదశ జ్యోతిర్లింగ దర్శనాల్లో మొదటి లింగం సోమనాథ్‌లో వుంది. ఈ పట్టణాన్ని ప్రభాస్ పటాన్ అనికూడా పిలుస్తారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## విత్తనోత్పత్తిలో అధిక ప్రయోజనాలు

నాతవరం : రైతులు సొంతంగా విత్తనోత్పత్తి చేసుకోవడం ద్వారా అధిక ప్రయోజనాలను పొందవచ్చునని అనకాపల్లి వ్యవసాయశిక్షణ కేంద్రం ఏడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలో విబి.అగ్రహారం, మన్యపురట్ల పంచాయతీలో విత్తనోత్పత్తిపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలానుగుణంగా వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకొని ప్రతీ రైతు తమ పొలంలో పండించిన పంటల ద్వారా సొంతంగా విత్తనాలు తయారు చేసుకోవాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్నిచ్చే పంటల సాగుపై దృష్టిసారించాలన్నారు. పంటలకు సోకే తెగుళ్లపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న వివిధ రకాల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. పంటలకు సోకిన తెగుళ్లను పరిశీలించి వాటి నివారణ చర్యలకు సూచనలు చేశారు. భూమి సారవంతానికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

ఈ కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారులు పద్మశోభ, నాయక్, ఎంపిఇఒ వాసిరెడ్డి కళావతి ఉన్నారు.

## వేసవిలో జాగ్రత్తగా ఉండాలి

రోలుగుంట : ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ఉపాధి కూలీలు తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని ఏపిఒ సూర్యమణి సూచించారు. ఆమె కొండపాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. వేసవితో చేసిన పనికి అదనంగా కూలి చెల్లిస్తున్నామని, ప్రస్తుతం వేతనం రూ.205లు పెంచినట్లు తెలిపారు. కూలీలు ప్రభుత్వం అందించిన టెంట్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అలాగే ఇప్పటి వరకు జరిగిన పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో లేవని, ఈ నెల 10వ తేదీ వరకు జరిగిన పనులకు సంబంధించిన బిల్లులు కూడా జమ అయ్యాయన్నారు. ఆమెతో పాటు విఆర్‌పి రమణ ఉన్నారు.

## సబ్సిడి రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

గొలుగొండ : వివిధ కార్పొరేషన్‌ల రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఒ ఎం.వి.సువర్ణరాజు సూచించారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బిసి, ఎస్సీ, కాపు, ఎస్టీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఆయా సామాజిక వర్గాల వారు కుల, ఆదాయ ధృవపత్రాలతో ఆన్‌లైన్ దరఖాస్తులు చేయాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించిన అర్హులకు సబ్సిడిపై రుణాలు మంజూరు చేస్తామన్నారు.

# జ్యూట్ మిల్ కార్మికుల సమస్య పరిశీలనకు నిరసన దీక్ష



భీమునిపట్నం: చిట్టివలస జ్యూట్ మిల్ సమస్యల కోసం ఆంధ్ర చైతన్య పార్టీ ఒక రోజు నిరసన దీక్ష జ్యూట్ మిల్ గేటు వద్ద చేపట్టారు. జ్యూట్ మిల్ అక్రమ లాకౌట్ చేసి ఈ రోజుకి తొమ్మిది సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికి సమస్య పరిష్కారంలో ఎలాంటి పురోగతి లేదని అందచైతన్య పార్టీ అధ్యక్షులు కంటుభుక్త. రామానాయుడు అన్నారు .

ప్రత్యక్షంగా సుమారు ఐదువేలు మంది పరోక్షంగా ఇరవై వేల మంది జీవితాలను ఇబ్బందికి గురిచేసిందని . సరైన దిశగా పోరాడి సమస్యను పరిష్కారించు కోవలసిన కార్మిక సంఘములు స్థానిక మంత్రి గారితో గాని మిల్లు యజమాని తో గాని కుమ్మక్కు అయినట్టు గా కనిపిస్తోందని. కార్మికులను కలసి వచ్చే ప్రజా సంఘాలను కలుపు కొని జ్యూట్ మిల్ కార్మికుల సమస్య పరిష్కారం అయ్యే వరకూ పోరాటాన్ని ఉధృతం చేస్తామని, ఆంధ్ర రాబోయే మూడు నాలుగు రోజుల్లో అన్ని పక్షాలతో జె.ఎ.సి ని ఏర్పాటు చేసే యాజమాన్యం దిగి వచ్చే వరకూ పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు.ఈ దీక్షలో పార్టీ అధికార ప్రతినిధి కె.శ్రీనివాసరావు, కె.సునీత,కందుకూరి.లావణ్య జ్యూట్ మిల్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న మంత్రి అయ్యన్న

నర్సీపట్నం : డివిజన్ కేంద్రమైన నర్సీపట్నంలో చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయ డానికి ప్రధాన రహదారి పక్కనున్న స్థలాలను అధికారులతో కలిసి ఆర్అండ్బీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పరిశీలించారు. గ్రామాల నుంచి వచ్చే వారికి చౌకగా పరిశుభ్రమైన టిఫిన్ భోజనం అందించేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రు.5లకే భోజనం లభిస్తుందని చెప్పారు. తహశీల్దార్ ఆఫీస్ పక్కన ఆర్డీవో కార్యాలయం వద్ద ఉన్న స్థలాలను పరిశీలించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి కె సూర్యారావు, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, తహసీల్దార్ వి.వి.రమణ ఉన్నారు.

# పరవాడ మండల పరిషత్ సమావేశం ప్రశాంతం

పరవాడ: పరవాడ మండల పరిషత్ సర్వ సభ్య సమావేసం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాసవరపు అప్పల నాయుడు అధ్యక్షతన ప్రశాంతముగా జరిగింది. ప్రభుత్వ అమలు,ప్రగతిపై శాఖల వారిగా సమీక్ష నిర్వహించారు. మండలంలోని తాగునీటీ సమస్యలపై పరవాడ సర్పంచ్ చుక్కా రాము నాయుడు, రావాడ సర్పంచ్ వియ్యపు లక్ష్మి పరవాడ ఎంపీటీసీ సభ్యులు పైల శ్రీనువాసు రావు, సభ దృష్టికి తీసుకోచ్చారు, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్లూఎస్ఏఈని ఎంపీపీ ఆదేశించారు. వైద్యపరంగా వేసవి కాలంలో ఎండ తీవ్రత కు అనేక మంది వడ దెబ్బ బారిన పడకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధి కారణి డా ప్రమీల తెలిపారు.మండల విద్యా శాఖాధికారణి సునీత మాట్లాడుతూ మండలం లోని అన్ని పాఠశాలలో ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్నాయని, 24 నుండి వేసవి సెలవులు ప్రకటించామన్నారు. 24నుండి 31 వరుకు మన ఊరు మన బడి కార్యక్రమం నిర్వహిస్తా మన్నారు. అలాగే నూతనంగా జ్ఞాన ధార కార్యక్రమం నిర్వహిస్తుమన్నారు. ఎన్ఆర్ జీఎస్, పంశు సంవర్ధశాఖ, ఆర్ డబ్లూఎ, పంచాయతీరాజ్, ఐసీడిఎస్ , అగ్రికల్చర్ ప్రగతి ని ఆయా శాఖల అదికారులు వివరించారు.

ఈ కారక్రమంలో వైస్ ఎంపీపీ చింతకాయల సుజాత ముత్యాలు ,ఎమ్ ఆర్ ఓ మల్లేశ్వర రావు, ఎమ్‌డి ఓ కరుణకుమారి, ఈ వార్డు హేమ సుందర రావు, ఎమ్ఈఓ సునీత, మండలం లోని, సర్పంచ్‌లు, ఎంపీటీసిలు సభ్యులు పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రిలో ఫోటోథెరపి విభాగాలను ప్రారంభించిన మంత్రి అయ్యన్న పాత్రుడు



ఫొటో థెరపి విభాగాలను ప్రారంభిస్తున్న మంత్రి అయ్యన్న

నర్సీపట్నం : ఎన్టీఆర్ ప్రాంతీయ ఆసుపత్రిలో కొత్తగా నెలకొల్పిన ఫొటోథెరపీ విభాగాలను రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు శుక్రవారం ప్రారంభించారు. నక్కపల్లి వద్ద గల హెటిరో కంపెనీ రూ. లక్ష 60వేల నిధులతో నెలకొల్పిన 3 యూనిట్లను మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన హెటిరో ప్రతినిధులను అభినందించారు. అనంతరం 'సి-ఆర్మ్' అనే ఆధునిక ఎముకల శస్త్రచికిత్స యంత్రాన్ని మంత్రి ప్రారంభిం చారు. రు.11.5 లక్షల విలువైన పరికరాలను కొనేందుకు అరుకు పార్లమెంటు సభ్యురాలు కొత్తపల్లి గీత ఎమ్‌పి నిధుల ద్వారా రూ. 20 లక్షలు సమ కూర్చారని తెలిపారు. ఆమెకు నర్సీపట్నం ప్రజల తరపున కఅతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రాంతీయ ఆసుపత్రుల్లో ఇటువంటి విభాగాలను ఏర్పాటు చేయడం ఇదే ప్రథమమని చెప్పారు. నర్సీపట్నం ఆసుపత్రిలో ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చడం జరుగుతున్నదని వీటిని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ సుధాశారద, వైద్యులు విజయశాంతి, ఆర్‌డిఒ కె.సూర్యారావు ఇతర వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్ బేనర్ ధ్వంసంపై డిహెచ్‌పిఎస్ ఆగ్రహం

## దోషులపై అట్రాసిటీ కేసుకై పోలీసులకు ఫిర్యాదు




చిత్రపటానికి ధ్వంసం

నర్సీపట్నం : అంబేద్కర్ చిత్రపటం ధ్వంసం చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిహెచ్‌పిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి అబీద్‌సెంటర్‌లో గల స్థానిక ఎస్సీ కాలనీ యూత్ ఏర్పాటు చేసుకున్న కటౌట్‌ను కాల్చడానికి ప్రయత్నించినట్లు తెలుస్తుందన్నారు. అంబేద్కర్ చిత్రపటాన్ని, యూత్ బమ్మలను చించివేయడం పట్ల అనుమానానికి గురయ్యామన్నారు. తక్షణమే సిసి కెమెరాల పుటేజి ద్వారా దోషులను గుర్తించి కేసు నమోదు చేయాలని స్థానిక ఎస్సీ కాలనీ వారంతా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. బలిఘట్టం, పెదబడ్డేపల్లి, నర్సీపట్నం తదితర ప్రాంతాల వారితో సాయంత్రం అబీద్‌సెంటర్‌ల్లో కొవ్వొత్తుల ర్యాలీకి పిలుపునిచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గుడాల వరహాలబాబు(ముఠా), కార్యదర్శి మర్రా చిన్ని(బోడ), నాగేంద్రబాబు, కోపరాల శివ, దుర్గాప్రసాద్, బిఎస్పీ నాయకులు నాగేశ్వరరావు, డిహెచ్‌పిఎస్ మండల అధ్యక్షులు మర్రా గోపి తదితరులు పాల్గొన్నారు.

# యలమంచిలిలో దీక్షలో ఎమ్మెల్యే పంచకర్ల

యలమంచిలి రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కావాలని తలపెట్టిన 12 గంటల రిలే నిరాహారదీక్షకు సంఘీభావంగా యలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జడ్పీ చైర్ పర్సన్ లాలం భవానీభాస్కర్‌లు యలమంచిలి పట్టణంలో రిలే నిరాహారదీక్షల్లో పాల్గని సంఘీభావం తెలిపారు. పట్టణ టీడీపీ అద్యక్షులు ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో గత 25 రోజుల నుంచి నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల వేదికపైనే శుక్రవారం ముఖ్యమంత్రి సంఘీభావంగా నాలుగు మండలాల ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్యే, జెడ్పీ చైర్ పర్సన్‌లు పాల్గన్నారు. ఈ కార్యక్రమలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లాలం భాస్కరరావు, యలమంచిలి ఎంపిపి కొలుకులూరి వెంకట పద్మావతి, విజయబాబు, మండల పార్టీ అధ్య క్షులు కాండ్ర కోట చిరంజీవి, మున్సిపల్ వైస్ చైర్మన్ కొలారు సాంబ, వైస్ ఎంపిపి గొన్నాబత్తుల నాగేశ్వరరావు, కౌన్సిలర్లు చంద్రరావు, పిట్టా శ్రీను పాల్గొన్నారు.




**బాబాసాహెబ్ అంబెడ్కర్ 127 వ జయంతిని పురస్కరించుకుని కెనరా బ్యాంకు మురళీనగర్ శాఖవారు , కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని 50 మంది దళిత,గిరిజన విద్యార్థినులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం బర్మాక్యాంపు , 37 వ వార్డు, కప్పరాడ ఉన్నత పాఠశాలలో జరిగింది.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధనోపాధ్యాయులుఎ.ఎస్.నాయుడు అధ్యక్షత వహించారు. కెనరా బ్యాంకు అధికారులు చంద్రశేఖర్,మురళినగర్ శాఖ మేనేజర్ భగవంత రావు, బీ.వీ.నాయక్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.**

## ఉచిత శిక్షణకు 8 మంది విద్యార్థుల ఎంపిక

రావికమతం : మరుపాక మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి జరిగిన అర్హత పరీక్షలో టి.అర్జాపురం క్లస్టర్ సిఆర్‌పి గుంటూరు రామారావు వద్ద ఉచిత శిక్షణ పొందిన 8 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అర్హత సాధించారు. తన క్లస్టర్ పరిధిలోని పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న 11 మంది విద్యార్థులకు గుంటూరు రామారావు 100 రోజుల పాటు ఉచిత శిక్షణ అందించారు. ఈ నెల 8వ వీరంతా ఎంట్రన్స్ రాయగా 8 మంది ఎంపికైనట్లు రామారావు తెలిపారు. ఇప్పటికే ఏడేళ్లుగా 73 మంది ఎంపికయ్యారు.

## మహిళాల అభ్యున్నతికి
# కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది

**విశాఖ పార్లమెంట్ సభ్యులు కంభంపాటి హరిబాబు**

మాధవధార : మహిళల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని విశాఖ పార్లమెంట్ సభ్యులు కంభంపాటి హరిబాబు అన్నారు. ఉజ్వల దినోత్సవాన్ని పురష్కా రించుకుని విశాఖ గ్యాస్ ఎజన్సీ అద్వర్యంలో లబ్ధిదారులకు ఉచితంగా వంటాగ్యాస్‌ను సిలిండర్‌ను పంపిణి చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహిన వర్గాల ప్రజలకు ఈ పథకం ద్వారా అన్ని జిల్లాల్లో తెల్ల రేషన్‌కార్డు కలిగిన ప్రతి వారికి ఈ పథకం ద్వారా ఉచితంగా గ్యాస్‌ను పంపిణి చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎంతో మంది కర్రల పొయ్యి ద్వారా వంట చేసుకోన్ని కోన్ని యేళ్ళ తరబడి శ్వాసకోస సంబంధిత వ్యాధులకు లోనవు తున్నారని అన్నారు. ఈ పథకం ద్వారా అనేక మంది ప్రజలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. అదేవిదంగా కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు పేద ప్రజలకు ప్రవేశపెట్టిందని వాటిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి పివిఎన్.మాధవ్, ఉత్తర నియోజక వర్గం శాసనసభ్యులు పి.విష్ణుకుమార్‌రాజు, బిజెపి నగర అధ్యక్షులు పి.నాగేంద్ర, విశాఖ గ్యాస్ ఎజన్సీ నిర్వహకులు ఐవి.సుబ్బారావు, బగాది విజయ్, 38వ వార్డు బిజెపి అధ్యక్షులు ఒమ్మి నారాయణరావు, బిజెఎంఎం నగర కార్యదర్శి బోర రమేష్, అప్పల కొండయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా సాగిన ధర్మ పోరాట దీక్ష ...




చోడవరం : ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హెూదా సాధన దిశగా అధికార తెలుగుదేశం నాయకత్వంలో స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ఆధ్వర్యంలో శుక్రవారం తహశీల్దారు కార్యాలయం వద్ద చేపట్టిన ' ధర్మ పోరాట దీక్ష ' విజయవంతంగా కొనసాగింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడు ఉప్పలపాటి సుకుమార వర్మతోపాటు పలువురు ప్రజాప్రతినిధులుతమ సంఘీభావాన్ని తెలియజేసారు. ఈ సందర్భంగా హెూదా సాదన ఉద్యమంలో కలసి వచ్చిన అనేక మంది ప్రజలను ఉద్దేశించి స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు మాట్లాడుతూ తిరుపతి వెంకన్న సాక్షిగా రాష్ట్ర ప్రజలకు ప్రధాని మోది ఇచ్చిన ప్రత్యేక హెూదా హామీపై బిజెపి ప్రబుత్వం దోబూచులాడుతోందన్నారు. 5కోట్ల ఆంధ్రుల మనోభీష్టాన్ని నెరవేర్చుకునేందుకు, చీకటి ప్రపంచాన్ని జయించేందుకు ప్రజలు రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఏర్పడిందని తెలియజేసారు. ప్రత్యేక హెూదా వలన రాష్ట్రం ఎంతో ప్రయోజనకారి అవుతుందని, ప్రజలందరూ గమనించాలని, రాజకీయాలకు అతీతంగా సాగుతున్న హెూదా పోరులో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుతో సుమారు 20 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అద్యక్షుడు సుకుమార వర్మ మాట్లాడుతూ ప్రత్యేక హెూదా ప్రభుత్వాలు పెట్టె భిక్ష కాదని, ఆంధ్రుల హక్కు అని తెలియజేసారు. హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా కారణంగా పన్నుల రాయితీతో కొత్త కర్మాగారాల ఏర్పాటు జరుగుతందని, దీని వలన ఉపాధి లభిస్తుందన్నారు. ధర్మ పోరాట దీక్షకు రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరిని ఆహ్వానించినట్లు తెలిపారు. హెూదా సాధనతో నిరుద్యోగం రూపుమారుతుందన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు, వామపక్షాలు, ప్రతిపక్షాలు, ఇతర ప్రజా సంఘాలన్నీ ఒకే వేదికపై హెూదా హక్కుపై ఉక్కు కంఠంతో నినదించాల్సిందిగా తెలియజేసారు. ఈ దీక్షకు మద్దతు తెలియజేసిన వారిలో గోవాడ షుగర్సు ఛైర్మను గూనూరు మల్లునాయుడు, నాలుగు మండలాల మహిళా సంఘాలు, సర్పంచులు, ఎం.పి.పి.లు, ప్రజా సంఘాలు తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం ఎం.పి.పి గూనూరు కొండతల్లి సత్యనారాయణ, జెడ్పీటిసి కె.మత్స్యరాజు, సర్పంచు దొమ్మేశి అప్పలనర్స గిరి, సహకార శాఖ ఉద్యోగ సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

# సింయంకు మద్దతుగా ఎమ్మెల్యే దీక్ష



పిఠాపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన ఒక్క రోజు ధర్మపోరాట దీక్షకు మద్దతుగా నియోజక వర్గస్థాయిలో పిఠాపురం ఉప్పాడ స్టాండ్ దగ్గర ధర్మపోరాట దీక్షలో ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్ వర్మ పాల్గొన్నారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా మరియు విభజన హామీలను నెరవేర్చకుండ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవహార ధోరణికి నిరసనగా ఈ రోజు చంద్ర బాబు నాయుడు చేస్తున్న ధర్మ పోరాట దీక్షకు సంఘీభావంగా పిఠాపురం నియోజకవర్గం మొత్తం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అందరూ ఉప్పాడ బస్‌స్టాండ్‌లో 5000 మంది తో సామూహిక నిరాహార దీక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీలన్నీ దొంగనాటకాలు ఆడుతున్నాయన్నారు. వై.సి.పిలో ఏడుగురు ఎంపిలలో 5 గురు రాజినామ చేసారని ఇద్దరు ఎంపిలు ఎందుకు రాజీనామ చేయలేదని ప్రశ్నించారు. ఎందుకు ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ప్రత్యేహోదా సాధించే తీరుతామని, ప్రత్యేక హోదా గురించి పోరాడు తున్న నాయకుడు చంద్రబాబు నాయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కరణం చిన్నారావు, వైస్ ఛైర్మన్ పిల్లి చిన్న, గుడా డైరెక్టర్ పిల్లి రవి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## కార్మికనాయకుడు ఈశ్వరరావు మృతి

యానాం : యానాం రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గుండవరపు ఈశ్వర రావు 45 మృతి చెందాడు. శుక్రవారం అరటి కాయలంక గోదావరి ఒడ్డున మృతదేహం పడి ఉండటంతో స్థానికులు కోరంగి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కోరంగి ఎస్ఐ సుమంత్ ఆధ్వర్యంలో పోలీసులటీం మృతదేహాన్ని పరిశీలించి ఒడ్డుకు చేర్చి పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ కలతవలనే మానసిక ఆందోళనకు గురై గోదావరిలో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతుడికి బార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారు డు ఉన్నారు. అరటికాయలంక స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. గత ఇరైఏళ్ళుగా కార్మికుల సంక్షేమానికి ఎనలేని సేవలు అందిం చి అకాలమరణానికి గురవ్వడం కార్మికులను కలచివేసింది. ఆయన మృతి వార్త వినినవెంటనే రైస్‌మిల్లులు అన్ని సంతాపసూచకంగా మిల్లు లను మూసివేసి ఇంజరంలోని ఆయన కుటుం బ సభ్యులను ఒదార్చి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు జరిగిన పరిస్థితిని తెలుసుకుని తీవ్రదిగ్భ్రాంతి చెందారు వారి కుటుంబసభ్యు లకు తన ప్రగాఢసంతాపాన్ని తెలియజేశారు.

## జివిఎల్ అండ్ యుఎం లింగం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



కాకినాడ : బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని కాకినాడ డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ ఆర్‌టిసి బస్‌స్టాండ్ నందు గరికపర్తి అలితాంబ మరియు ఉమామహేశ్వర లింగం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సామాజిక సేవలో భాగంగా తల్లిదండ్రుల పేరున గరికపర్తి సాయి కిరణ్ ( విశ్రాంత డిఇ ఇరిగేషన్) ఇటువంటి సేవాకార్యక్రమాలు చేయడం అభినంద నీయమ న్నారు. అనంతరం మరో ముఖ్య అతిథి రీజనల్ డిప్యూ టి డైరెక్టర్ (ల్యాండ్ సర్వే డిపార్ట్‌మెంట్) సిహెచ్‌వి ఎన్ఎన్.కుమార్ మాట్లాడుతూ వేసవిలో చలివేంద్రాల ద్వారా ప్రయాణి కులకు త్రాగునీటిని అందించడం ఎంతో పుణ్యకార్యమన్నారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త, ఆంధ్రా యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ సభ్యులు మానికిరెడ్డి సత్య నారాయణ, ఆర్‌టిసి సిఐ.జిజివి.రమణ, గౌరవ సలహాదారుడు గరికపర్తి నమ:శ్శివాయ, ప్రభల సత్యవతి, ఎస్‌జి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## అందరికి పించన్లు -చినరాజప్ప

పెద్దాపురం : గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఉన్న అర్హులైన వారందరికి పించన్లు మంజూరు చేస్తామని ఉపముఖ్యమంత్రి చినరాజప్ప అన్నారు. పెద్దాపురం మండలం పులిమేరు గ్రామం దళితవాడలో రూ. 33.83 లక్షలతో నిర్మించనున్న ఐదు కల్వర్టుకు చినరాజప్ప శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంతా మాట్లాడుతూ గ్రామాలలో ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నూరు శాతం కృషిచేస్తామని అందులో భాగంగా నేడు దళితపేటలో సిసి రోడ్లు మరియు సామాజిక భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ముందుగ కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల వీరాస్వామి నాయుడు, కొత్తెం శ్రీనివాస్, తుమ్మల బుల్లెయ్య, తుమ్మల నాని, జలవనరులశాఖ జే.ఇ. పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతికుటుంబానికి రూ. 200 అందించాలి

పెద్దాపురం : కలెక్టర్ ఆదేశాలమేరకు ఉపాధి కూలీలకు ప్రతికుటుంబానికి రూ. 200లు వేతనం అందించాలని పెద్దాపురం ఆర్డీవో విశ్వేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎండిఒ కార్యాలయంలో గురువారం సాయంత్రం జాతీయ ఉపాధి హామీ పథకం వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఇ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఉపాధి హామీ పథకం అమలుపై వచ్చిన సూచనలను సంబంధిత అధికారులు తప్పకుండ అమలుచేయ్యాలని కోరారు. అమలు చేయ్యని వారిపై చర్యలు తీసుకోబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వసంతమాదవి, ఎసిడి రంగనాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన మంత్రి మల్లాడి

యానాం : మంచినీటి చెరువులకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రాను పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు కలిసి విజ్ఞప్తిచేశారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన కలిసి యానాంలోని మంచినీటి చెరువుల్లో నీటి కొరతను సంబంధిత ఫొటోల ఆధారలతో కలెక్టర్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ నీటి విడుదలకు ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చినట్లు తెలిసింది. కలెక్టర్‌ను కలిసినవారిలో పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యే శ్వరరావు, ప్రజాపనులశాఖ ఇఇ రాందాసు, ఎఇ మేడిశెట్టి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి ఆసీఫా అత్యాచారానికి నిరసనగా నేడు కాకినాడలో కాగడాల ర్యాలీ

కాకినాడ: చిన్నారి ఆసీఫా పై జరిగిన అత్యాచారాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపిడబ్ల్యుజెఎఫ్) ఆధ్వర్యంలో శనివారం భారీ కాగడాల ర్యాలీను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.సలీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసీఫాపై అత్యాచారం జరిపిన నిందితులను కఠినంగా శిక్షించాలని, అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా ఇవ్వాలన్న డిమాండ్లతో శనివారం సాయంత్రం 6 గంటలకు కాకినాడలోని భానుగుడి సెంటర్ నుండి రాజా ట్యాంక్(కుళాయి చెరువు) వద్ద వున్న భరతమాతా విగ్రహం వరకు సుమారు 300 మందితో భారీగా కాగడాల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో జర్నలిస్టులు, అన్ని ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి విద్యార్థి సంఘాలు, రాజకీయా పార్టీ నాయకులు పాల్గొంటారని తెలిపారు.

## చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు

విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు గంట్యాడ శంకర్రావు ఆధ్వర్యంలో దొండపర్తి ఎస్సీ కాలనీలో కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్‌కట్‌చేసి పేద వృద్ధులకు చీరలు, స్వీట్స్, కేకులు పంపిణీచేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు చేస్తున్న దీక్షకు మద్ధతుతెలుపుతూ రాష్ట్రంలో ఉన్న దళితులందరూ మీ వెంటే ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి యూత్ ఉపాధ్యాక్షుడు మజ్జి కోటేశ్వరరావు, బుజ్జి, ఈతలపాక సింహాద్రి, అల్లూరి వెంకటేశ్వరరెడ్డి, గున్నచారి, శంకర్, జి శాంతకుమారి, జి చంద్రమ్మ, జి. రాముడు లక్ష్మణ్, జి సత్యం, టి. గోవిందరాజు పాల్గొన్నారు.

# హక్కుల సాధనలో రాజీలేని పోరాటం: ఎమ్మెల్యే ఆనందరావు



అమలాపురం: హక్కుల సాధనలో రాజీలేని పోరాటం చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన ధర్మ పోరాట దీక్ష దీక్షకు ఎమ్మెల్యే అధ్యత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడి అంటే మోసగాడు అని కేంద్రంలో బిజెపితో టిడిపి పొత్తు పెట్టుకోవడం తో ముస్లిం ఓట్లను టిడిపి కోల్పోయిందని అన్నారు. రాష్ట్రంలో బిజెపి ఉనికి చాటుకోవడం కోసమే 2014 ఎన్నికల్లో బిజెపి ఓడిపోతుందని తెలిసి ప్రత్యేక హెూదాకు మద్దతు ఇస్తామని తెలిపి అధికారంలోకి వచ్చిన తరువాత బిజెపి పార్టీ ద్రోహం చేసిందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ మెట్ల రమణబాబు, మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, జిల్లా తెలుగుమహిళా కార్యానిర్వాహక కార్యదర్శి బిఎస్ రాధమ్మ, వైస్ ఛైర్మన్ పెచ్చెట్టి విజయలక్ష్మి, మున్సిపల్ ఛైర్మన్ చిక్కాల వినాయకరావు, ఎంపిపి బొర్రా ఈశ్వరరావు, నిమ్మకాయల జగ్గయ్యానాయుడు, జెడ్‌పిటిసి అధికారి జయవెంకటలక్ష్మి బాబ్జి, యాళ్ళ నాగ వెంకట సతీష్, వేగిరాజు వెంకట పతిరాజు, చింతా ఝాన్సీలక్ష్మీ శ్రీనివాస్, కమిషనర్ సిహెచ వివిఎస్ బాపిరాజు, ఆశెట్టి ఆదిబాబు, నల్లా శ్రీదేవి,వలవల శివరావు, అధిక సంఖ్యలో నాయ కులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# రాంగోపాల్‌వర్మ వైఖరికి నిరసనగా జనసేన ఆందోళన

### పిఠాపురంలో వర్మ దిష్టిబొమ్మ దగ్ధం



పిఠాపురం : సంచలన చిత్రాల నిర్మాణ దర్శకుడు రాంగోపాల్‌వర్మ వైఖరికి నిరసనగా పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిపల్ కళ్యాణ మండపం ఎదురుగా వర్మ దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా రాంగోపాల్ వర్మకు, కార్యరెక్టర్ అర్టిస్ట్ శ్రీ రెడ్డిలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నియోజకవర్గ జనసేన నాయకులు ఎమ్.జగదీష్ చంద్రవాసు మాట్లాడుతూ జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌పై, పవన్ కళ్యాణ్ తల్లి అంజనాదేవి పట్ల శ్రీ రెడ్డి నోటికి వచ్చినట్లు మాట్లాడటం దారుణమన్నారు. పవన్ కళ్యాణ్ ప్రముఖ సినీ నటుడే కాకుండా జనసేనకు రాష్ట్ర అధినేతగా ఉన్న విషయాన్ని మరిచి మాట్లాడటం సరైనవిధానం కాదన్నారు. నిజాయితీ పరుడైన పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి వచ్చి ఎ ొ ద ొ వ ) ల తో నిమిత్తంలేకుండా స్వచ్ఛ రాజకీయాలు చేస్తుంటే శ్రీ రెడ్డిలాంటి అరిస్ట్‌లను ముందుపెట్టి పవన్ కళ్యా ణ్‌ను దెబ్బతీయాలను కోవ డం, అందులో భాగంగానే వెనుకుండి వర్మ శ్రీరెడ్డితో ఆరోపణలు చేయించినట్లు విమర్శించారు. రాజకీయం గా పవన్‌ను ఎదుర్కోలేక కొంత మంది స్వార్ధ రాజ కీయనేతలు కొన్ని మీడి యా సంస్థలు కలిసి అడు తున్న నాటకమన్నారు. ఈ సందర్భంగా నియోజకర్గ మహిళా అధ్యక్షురాలు చల్లా లక్ష్మి మాట్లాడుతూ జనసేన పార్టీలో మహిళలకు సముచిత స్థానం కలిపించడం జరిగిందన్నారు. మహిళలంటే తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌కు ఎంతో గౌరవమన్నారు. అలాం టిది శ్రీరెడ్డి ఎటువంటి ఆధారాలు లేకుండా పవన్ కళ్యాణ్ లాంటి నిజాయితీ పరుడైన రాజకీయ నేతపై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేయడం ఆమెకు తగదన్నారు. ఆమె వ్యాఖ్య లను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పార్టీ అధినేతను విమర్శిస్తే తమస్థాయి పెరుగు తుందనుకోవడం అవివేకమన్నారు. ఈ కార్య క్రమంలో బాలిపల్లి రాంబాబు, బాలిపల్లి అనిల్ కుమార్, ముమ్మిడి శివశంకర్, పెదిరెడ్ల చిట్టి కుమార్, కొమ్మినిడి రాజేంద్ర, పల్లికల సునీత్, దాసరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రికి సంఘీబావంగా ఎమ్మెల్యే అనిత దీక్ష



పాయకరావుపేట: రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలను అమలుచేయని కేంద్రప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టిన దీక్షకు సంఘీబావంగా పాయకరావుపేటలో శుక్రవారం ఎమ్మెల్యే వంగల పూడి అనిత దీక్షకు దిగారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీగా చిత్రమందిర్ థియేటర్ సమీపంలో ఏర్పాటుచేసిన ధర్మపోరాట దీక్షాశిబిరానికి చేరుకుని అనుచర గణంతో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిత మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముందుకువెళుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు తన జన్మదినం సందర్భంగా సంతోష క్షణాలను ఆస్వాదించకుండా జన్మభూమి రుణం తీర్చుకోవటానికి 68ఏళ్ళ వయసులో శుక్రవారం అన్నపానీయాలు ముట్ట కుండా నిరాహారదీక్ష చేపట్టారన్నారు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని ఇప్పటి ఎన్ డిఎ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. తిరుపతి ఎన్నికల సభలో తాము అధికారంలోకివస్తే ప్రత్యేకహోదాతోపాటు రాష్ట్రాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తామని తిరుపతి వెంకన్న సాక్షిగా మోదీ హామీ ఇచ్చారన్నారు. బిజెపితో చెలిమిచేసి అన్నివిధాల సహకరించిన తమను ప్రధాని మోదీ, బిజెపి జాతీయ అధ్యక్షు డు అమిత్ షా నయవంచనకు పాల్పడ్డారన్నారు. చంద్రబాబు దీక్షకు కూర్చుంటే ఈరోజు శు క్రవారం ప్రతిపక్షనేత జగన్ అవి నీతి కేసుల్లో కోర్టుకు వెళ్ళారన్నా రు. ఇటువంటి నేరపూరితులతో చేతులు కలిపిన బిజెపి, తమ పార్టీని, ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేయాలని కుయుక్తులు పన్నటం హేయమైన చర్యన్నారు. ఇప్పటికైనా కేంద్రం దిగివచ్చి రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలను నెరవేర్చాలని ఎమ్మెల్యే అనిత డిమాండ్ చేసారు. విశాఖజిల్లా గ్రంథాలయసంస్థ మాజీ అధ్యక్షుడు తోటనగేష్ మాట్లాడుతూ ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసి దాని స్థానంలో నీతి ఆయోగ్ ప్రవేశపెట్టి ఏ రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వటానికి వీలుపడదని కొర్రీలు పెడుతూ రాష్ట్రానికి అన్యాయంచేస్తున్న ప్రధాని మోదీ ప్రజాక్షేత్రంలో తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు.ఇప్పటికైనా కేంద్రం తాను చేసిన తప్పులను సరిదిద్దుకుని రాష్ట్రానికి న్యాయం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంపిపిల సంఘం అధ్యక్షులు వినోద్ రాజు,సిడిసి ఛైర్మన్ బోయిడి శ్రీనివాస్ ,పాండురందేవస్థానం ఛైర్మన్ యాళ్ళ వరహాలబాబు, టిడిపి పాయకరావుపేట,నక్కపల్లి,ఎస్ రాయవరం,కోటవురట్ల మండలశాఖ అధ్యక్షులు చిట్టిబాబు, నూకరాజు, వెంకటరాజు,కాశీనాయుడు, పట్టణ శాఖ అధ్యక్షులు నారాయణరావు, చినదొడ్డిగల్లు సర్పంచ్ వెలగా శ్రీనివాస రావు, తదితరులతోపాటు పలువరు టిడిపి నాయకులు,కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

### శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం



రావులపాలెం : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా ఇచ్చే విషయంలో కాంగ్రెస్, బిజెపి పార్టీలు తీరని అన్యాయం చేసాయని శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. శు క్రవారం రావులపాలెం టిడిపి కార్యాలయం వద్ద నియోజక వర్గ ఇన్‌చార్జ్ బండారు సత్యానందరావు పార్టీ శ్రేణులతో చేపట్టిన ధర్మపోరాట దీక్షకు ముఖ్య అతిధిగా రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎంపి పండుల రవీంద్రబాబులు హాజరై సంఘీభావాన్ని తెలిపారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భముగా డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన సందర్భములో ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ప్రత్యేక హెూదా అయిదేళ్ళు కల్పిస్తామని ప్రకటిస్తే ప్రతిపక్షంలో ఉన్న బిజెపి అయిదేళ్ళు సరిపోదు పదేళ్ళు ఉండాలని కోరిన సంఘటనలు గుర్తు చేసారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తే ఈనాడు బిజెపి పార్టీ నమ్మక ద్రోహం చేసిందని ఖచ్చితంగా పార్లమెంటు సాక్షిగా ఎపికి ఇచ్చిన హామీలను నెరవేర్చా లని డిమాండు చేసారు. అమలా పురం పార్లమెంటు సభ్యులు పండు ల రవీంద్రబాబు మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో రాజకీయ అను భవము కలిగిన వ్యక్తి అని, అదే స్ఫూర్తితో ప్రత్యేక హెూదాపై రాజీ లేని పోరాటం చేస్తామన్నారు. తన పుట్టిన రోజును సైతం రాష్ట్ర ప్రయోజనాలకోసం త్యాగం చేసిన వ్యక్తి చంద్రబాబు అని రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు వల్లే సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. ఈ దీక్షకు వివిధ కుల సంఘాలు, మహిళా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ఆటో యూనియన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్, లారీ ఓనర్స్ యూనియన్, గోపాలపురం ఇసుక ర్యాంపు జట్టుకూలీలు, విద్యార్థి సంఘాలు దీక్షా స్థలానికి చేరుకొని సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్‌పిపి రెడ్డి అనంతలక్ష్మి, ఎఎమ్‌సి ఛైర్మన్‌లు వేగేశ్న చంద్రరాజు, ఈదల నల్లబాబు, వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్ కరుటూరి నరసింహారావు, గుత్తుల పట్టాభి రామారావు, కొవ్వూరి జగన్నాధరెడ్డి, జెడ్పిటిసి దర్నాల రామకృష్ణ, వైవి., పల్లికొండ సుధీర్, గుత్తుల శ్రీనివాస్, ఎమ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, గ్రామ పార్టీ అధ్యక్షులు వెలగల శ్రీనివాసరెడ్డి, వార్డు సభ్యులు, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు

# హిందూ దేశానికి జ్ఞానభిక్ష ఆదిశంకరాచార్యులు

## ఘనంగా శంకర జయంతి ఉత్సవాలు



విశాఖపట్నం : హిందూ దేశంలో అద్వైత మత ప్రచారాన్ని చాటిచెప్పి హిందువులకు జ్ఞానభిక్షను పెట్టిన ఆదిశంకరాచార్యులు పరమపూజ్యులు అని షణ్మత స్థాపనాచార్య జగద్గురువు శంకరాచార్య విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి వారు అభిభాషించారు. శుక్రవారం శంకచార్య జయంతి సందర్భంగా పీఠప్రాంగణంలో గల శ్రీ శంకర జయంతి పర్వదినం సందర్భంగా స్వామి వారి విగ్రహానికి పంచామృతాభిషేకం గావించి పుష్పమాల అలంకృతులను చేసిన అనంతరం పీఠ ప్రాంగణంలో సామూహిక ఉపనయనాలు స్వర్ణ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష హెూమాలు నిర్వహించారు. అనంతరం గుంటూరు బయలుదేరి వెళ్లారు.

**బుద్ధుని విగ్రహం పెడితే రాష్ట్రం అధోగతే హిందూ పరిరక్షణకు కృషి చేస్తాం**

**ఆదిశంకర జయంత్యోత్సవంలో శ్రీచరణులు**

గుంటూరు చేరుకున్న శ్రీచరణులు పలు ప్రాంతాలలో పర్యటించారు. పర్యటనలో భాగంగా శంతకర మందిరంలో ఆదిశంకరుల పూజ అనంతరం పండిత సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనుగ్రహ భాషణం చేస్తూ యావత్ భారత దేశానికి జ్ఞానభిక్ష పెట్టిన జగద్గురు ఆదిశంకరాచార్యులేనన్నారు. అలనాడు కులము, మతము, జాతి, వర్గము, లింగము అని బేధ భావన లేకుండా అదైత వేదాంతాన్ని ప్రబోధించినది ఆదిశంకచార్యులేనని వక్కాణించారు. శంకర జయంతి ఉత్సవాలలో భాగంగా ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో ఎందుకు నిర్వహించటం లేదు అని ప్రశ్నించారు. నవ్యాంధ్ర ఏర్పడిన దగ్గర నుంచి చూస్తున్నాం. ఎంతో ఉన్నతంగా అభివృద్ధి చెందిన నవ్యాంధ్రప్రదేశ్‌లో ఎక్కడ చూసినా బుద్ధుని విగ్రహాలే దర్శనమిస్తున్నాయి. శూన్యం నుంచే జగత్ అంతా ఉద్భవించిందనే బుద్ధుని బోధనలు ప్రచారం చేయడం ఆంధ్రప్రదేశ్ దురదృష్టమన్నారు. మనము శూన్యవాదులం కాదు. అద్వైతులం అని, భగవంతుడు ఎక్కడో ఉండి నడిపిస్తున్నాడు అనేది మూఢ నమ్మకం. మనలోనే భగవంతుడు కొలువై ఉన్నాడు. దానికి సాక్షి అంతరాత్మ అని తెలియజేసిన గొప్ప మన సిద్ధాంతం అనేది శంకరుల భావన. అతి పిన్న వయసులోనే వేదాధ్యయనం చేసి, భారతదేశం నేల నాలుగు చెరగులా తిరిగి, ఉపనిషత్తులకు భాష్యాలను రచించి, వేదాధ్యయనం చేసి, భగవద్గీత, బ్రహ్మసూత్రాలకు, ఉపనిషత్తులకు భాష్యాలను రచించి. దేశంలో పాతుకుపోయిన బౌద్ధ, జైన వంటి మతాలను పారద్రోలి అద్వైత స్థాపన చేసిన ప్రముఖులు ఆదిశంకరాచార్యులు అని చాటిచెప్పిన గురువు ఆదిశంకరాచార్యుడు అని సూచించారు. ఇలాంటి శంకర జయంత్యుత్సవాలను రాష్ట్రం నిర్వహించకపోవడం శోచనీయం అన్నారు. శ్రీశైలం, తిరుపతి తదితర పుణ్యక్షేత్రాలలో శంకరాచార్యుల మందిరాలు ఉన్నాయి. అలాంటిది నూతనంగా నిర్మిస్తున్న దేవాలయాలలో శంకరాచార్యుల విగ్రహాలు ప్రతిష్టించాలని, కనీసం శంకరుల చిత్రపటాన్నైనా పెడితే శుభం జరుగుతుందని శ్రీచరణులు అన్నారు. ఈ సందర్భంగా వేదపండితులు ముదుగొండ వెంకటప్పయ్య శాస్త్రి, విష్ణుభట్ల శ్రీరామమూర్తి శాస్త్రిలను సుర్ణ అంగుళీకములతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మర్రిరెడ్డి రామకృష్ణారెడ్డి ఉచితంగా ఏర్పాటు చేసిన మజ్జిగ పంపణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ ఎంఎల్‌సి డొక్కా మాణిక్య ప్రసాద్, తిరుపతిరెడ్డి, పీఠం ధర్మాధికారి కామేశ్వర శర్మ, ఆస్థాన పండితుడు కృష్ణ శర్మతోపాటుగా అనేకమంది భక్తులు, ప్రముఖులు పాల్గని స్వామి వారి ఆశీస్సులు గైకొన్నారు.






# రికార్డు స్థాయిలో పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలు

దిల్లీ: డీజిల్, పెట్రోల్ ధరలు రికార్డు స్థాయిలో పెరిగిపోయాయి. శుక్రవారం డీజిల్ ధర ఆల్ టైం గరిష్ఠానికి చేరింది. దిల్లీలో ఈరోజు లీటర్ డీజిల్ ధర రూ.65.31గా ఉంది. కోల్‌కతాలో రూ.68.01గా, ముంబయిలో రూ.69.54గా, చెన్నైలో రూ.68.9గా ఉంది. పెట్రోల్ ధర కూడా 55 నెలల గరిష్ఠానికి చేరింది. ఇండియన్ ఆయిల్ వెబ్‌సైట్ ప్రకారం దిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.74.08గా ఉంది. 2013 సెప్టెంబర్ తర్వాత ఇదే అత్యధిక ధర.

ఈ ఏడాది మార్చి నుంచి ప్రముఖ నగరాల్లో పెట్రోల్ ధర 50పైసలకు పైగా, డీజిల్ ధర 90పైసలకు పైగా పెరిగింది. ఏడాది ప్రారంభంలోనూ ప్రముఖ నగరాల్లో పెట్రోల్ ధర రూ.4కు పైగా, డీజిల్ ధర రూ.5-6 మధ్యలో పెరిగింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ గత ఏడాది జూన్‌లో పదిహేను రోజులకోసారి ధరలు మార్చే విధానాన్ని తీసేసి ప్రతి రోజూ ధరలు మారే విధానాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ విధానంతో ధరల మార్పు ప్రభావం వెంటనే చూపిస్తోంది.

ఆదివారం దిల్లీలో పెట్రోల్ ధర రూ.73.73తో నాలుగేళ్ల గరిష్ఠానికి చేరగా, డీజిల్ ధర రూ.64.58పైసలతో ఆల్ టైం గరిష్ఠానికి చేరింది. ధరలు బాగా పెరుగుతుండడంతో ప్రభుత్వం ఎక్సైజ్ పన్నులు తగ్గించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. దక్షిణాసియా దేశాల్లో భారత్‌లోనే పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు అధికంగా ఉన్నాయి.

# ప్రధాని మోదీతోనే రాష్ట్ర అభివృద్ధి : కృష్ణంరాజు



విశాఖపట్నం: రాష్ట్రం గత మూడేళ్లలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందిందని ప్రధానిగా మోదీ ఉండటంతోనే ఇది సాధ్యమైందని సినీ నటుడు, కేంద్ర మాజీ మంత్రి కృష్ణంరాజు అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మోదీని దెబ్బ తీయడానికి కొన్ని రాజకీయ పక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో జీడీపీ 11.5 శాతానికి పెరగడం దక్షిణ భారతదేశంలో కూడా అభివృద్ధి పనులు జరిగాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాని దీక్షను తప్పు పట్టారని నేడు రాష్ట్రంలో చంద్రబాబు చేపడుతున్న దీక్ష వల్ల ఎలాంటి లాభం చేకూరుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా వినియోగించుకోలేకపోయిందని పేర్కొన్నారు.

# చంద్రబాబుకు మోదీ జన్మదిన శుభాకాంక్షలు

దిల్లీ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు ఆయురారోగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ట్వీట్ చేశారు. తెదేపా-భాజపా మధ్య సంబంధాలు ప్రస్తుతం ఉప్పు-నిప్పు మాదిరిగా మారిన సందర్భంలో చంద్రబాబుకు మోదీ జన్మదిన శుభాకాంక్షలు తెలపడం ఆసక్తిగా మారింది.

రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన జన్మదినం రోజున ధర్మపోరాట దీక్ష పేరుతో నిరసన తెలుపుతున్న సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ పట్ల కేంద్ర ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఇటీవలే ఎన్డీయే కూటమి నుంచి తెలుగుదేశం పార్టీ వైదొలగింది. అప్పటినుంచి భాజపా-తెదేపా మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. తెదేపా ఎంపీలు కేంద్రంపై లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం ఇచ్చారు. దానిపై చర్చ జరగకుండా భాజపా అడ్డుకుంటోందని చంద్రబాబు విమర్శలు చేశారు. ఈ క్రమంలోనే ప్రధాని మోదీని సైతం లక్ష్యంగా చేసుకుని తీవ్రమైన విమర్శలే చేశారు. కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని మరింతగా ఎండగట్టేందుకు తన పుట్టినరోజున ధర్మపోరాట దీక్ష పేరుతో 12 గంటల పాటు దీక్ష చేపట్టారు.

# విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో దొంగల హల్‌చల్

కాల్దరి: విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో దుండగులు హల్‌చల్ చేశారు. శుక్రవారం తెల్లవారుజామున పశ్చిమగోదావరి జిల్లా కాల్దరి-సత్యవాడ రైల్వే స్టేషన్ల మధ్య విశాఖ ఎక్స్‌ప్రెస్ చైన్ లాగి రైలును ఆపిన దుండగులు మహిళల మెడల్లో బంగారు ఆభరణాలను దోచుకున్నారు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళుతుండగా ఘటన. ఈ ఘటనలో పది మంది దుండగులు పాల్గొన్నట్లు సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు నిడదవోలు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# షిర్డీ సాయిబాబాను దర్శించుకున్న సీఎం కేసీఆర్



షిర్డీ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహారాష్ట్రలోని షిర్డీ సాయిబాబా ఆలయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం సందర్శించారు. ఉదయం హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఆయన షిర్డీకి బయలుదేరి వెళ్లారు. కేసీఆర్ వెంట కుటుంబ సభ్యులు, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ ఉన్నారు. సాయిబాబా ఆలయానికి చేరుకున్న కేసీఆర్‌కు షిర్డీ సంస్థాన్ ట్రస్ట్ నిర్వహకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం ఒకటిన్నర గంటల సమయంలో కేసీఆర్ కుటుంబ సమేతంగా సాయిబాబాను దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కేసీఆర్ తిరిగి అదేరోజు సాయంత్రానికి హైదరాబాద్ చేరుకోనున్నారు.

# టీటీడీ పాలకమండలి సభ్యులు వీరే..

అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులను ప్రభుత్వం ప్రకటించింది. ఎంపీ రాయపాలి సాంబశివరావు, ఎమ్మెల్యే జీఎస్ఎస్ శివాజీ, ఉమ, అనిత, చల్లా రామచంద్రారెడ్డి, పొట్లూరి రమేష్‌బాబు, రుద్రరాజు పద్మరాజు, మేడా రామచంద్రారెడ్డి, డొక్కా జగన్నాథం, తెలంగాణ నుంచి పెద్దిరెడ్డి, సండ్ర వెంకట వీరయ్య, కర్ణాటక నుంచి సుధా నారాయణ మూర్తి, మహారాష్ట్రకు చెందిన స్వప్నను టీటీడీ బోర్డు మెంబర్లగా నియమించారు. ఇందుకు సంబంధించి కాసేపట్లో అధికారికంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది.

ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి కొత్త చైర్మన్‌గా కడప జిల్లా మైదుకూరుకు చెందిన టీడీపీ నేత పుట్టా సుధాకర్‌యాదవ్ నియమించిన విషయం తెలిసిందే. అందరి సహకారంతో భక్తులకు మెరుగైన సేవలు అందిస్తామని సుధాకర్ చెప్పారు. టీటీడీ చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సుధాకర్‌యాదవ్ గతంలో టీటీడీ పాలకమండలి సభ్యుడిగా పనిచేశారు.



హోదా సాధించే వరకూ పోరాటం ఆగదని విశాఖపట్నం ఏవిఎన్ కళాశాల వద్ద దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చేస్తున్న ధర్మపోరాటనికి మద్దతుగా మంత్రి గంటా శ్రీనివాసరావు డోలు వాయిస్తూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హామీలను తుంగలోకి తొక్కిందని ప్రచారం చేస్తున్న దృశ్యం. ఈకార్యక్రమంలో కాశీవిశ్వనాధ్, ఎస్ఎ రెహమాన్, బుచ్చా రామిరెడ్డి, గోడి నరసింహాచార్యులు, జెర్రిపోతుల ప్రసాద్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, మహిళలు అదిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్ఐఎన్ఎల విశాఖ ఉక్కు పరిశ్రమ భద్రతకే ప్రాధాన్యతనిస్తుంది

## - సంస్థ సి.యం.డి మధుసూధన్



గాజువాక: రాష్ట్రీయ ఇస్పాత్ నిగామ్ లిమిటెడ్ విశాఖ ఉక్కు కర్మాగారం భద్రతకు కార్మికుల రక్షణకు మొదటి ప్రాధాన్యతిస్తుందని సంస్థ సి.యం.డి పి.మధుసూధన్ స్పష్టం చేసారు. సంస్థలో ఈ నెల ఏప్రిల్ 14వ తేదీ నుంచి 20వ తేదీవరకు నిర్వహించిన "అగ్నిమాపక వారం" (ఫైర్ సర్వీస్ వీక్ )శుక్రవారం తో ముగిసింది. ఈ సందర్భంగా ఉక్కునగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ సి.యం.డి మధుసూధన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగులకు సురక్షితమైన పని, భద్రతా చైతన్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సి.ఐ.యస్.ఎఫ్, ఫైర్‌వింగ్ అనేవి సంస్థ యొక్క భద్రత కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. అగ్నితో వ్యవహరించడం, అగ్నిప్రమాద సంఘటనలను తగ్గించడం పరిశ్రమలో ప్రధాన సవాల్లో ఒకటని అన్నారు. సి.ఐ.ఎస్.ఎఫ్, ఫైర్‌వింగ్ విభాగాలు పరిసరాలను కాపాడడానికి ఉత్తమ సేవలను అందిస్తుందని కొనియాడారు. తొలుత సి.ఐ.ఎస్.ఎఫ్, ఫైర్‌వింగ్‌లు సి.యం.డి కి ఏరియల్ సెల్యూట్ చేసారు. అనంతరం సి.ఐ.ఎస్.ఎఫ్ ఆద్వర్యంలో ఫైర్ ప్రివెన్షన్, ప్రొటెక్షన్ అను పుస్తకాన్ని విడుదల చేసారు. సి.ఐ.ఎస్.ఎప్ కమాండెంట్ ఇర్ఫాన్ అహ్మద్ సిఐఎస్ఎప్, ఫైర్ వింగ్ చేయు కార్యకలాపాలను, భద్రతా చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు పి.సి మహాపాత్రో, పి.రేచౌదరి, పి.కె.రథ్, కార్యనిర్వాహకాధికారులు, యూనియన్ ప్రతినిధులు, సి.ఐ.ఎస్ఎఫ్ అధికారులు కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com

# బాల్య వివాహాల నియంత్రణకు అద్భుత అవకాశం చంద్రన్న పెళ్లి కానుక

## జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్



విజయనగరం : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రన్న పెళ్లి కానుక బాల్య వివాహాల నియంత్రణకు అద్భుత అవకాశంగా జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ అభివర్ణించారు. శుక్రవారం స్థానిక మహిళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చంద్రన్న పెళ్లి కానుక సింగిల్ డెస్క్ విధానాన్ని లాంఛనంగా ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18న చంద్రన్న పెళ్లికానుక లోగోను రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించిన నేపథ్యంలో 20వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా చంద్రన్న పెళ్లి కానుక వధూవరుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఇదివరకు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ, ఇవ్యాంగుల వివాహాలకు ఆయా సంస్థలు ప్రోత్సాహకాలను అందించేవని, ప్రస్తుతం వాటన్నింటిని ఒకే గొడుగు క్రిందకు చేర్చి సింగిల్ డెస్క్ విధానాన్ని ముఖ్యమంత్రి ఏర్పాటు చేయడం మనందరికి గర్వకారణమన్నారు. చంద్రన్న పెళ్లికానుక ద్వారా వధూవరుల వివరాలు నమోదుతో పాటు వారికి ప్రోత్సాహకాన్ని అందించడమే కాకుండా వారం రోజులలోగా వివాహ ధృవపత్రాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కళ్యాణమిత్రలు వధూవరుల వివారలు పరిశీలించడం ద్వారా బాల్య వివాహాలను నియంత్రించవచ్చని, అనేక సామాజిక, శారీరక, ఆరోగ్య, మానసిక సమస్యలు సృష్టించే బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించవద్దని కలెక్టర్ సూచించారు. చంద్రన్న బీమా పథకంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాలు చొరవతో జిల్లా మొదటి స్థానంలో ఉందని అదే స్ఫూర్తితో చంద్రన్న పెళ్లికానుక పథకంలో రిజిస్ట్రేషన్లు చేపట్టి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని కళ్యాణ మిత్రలను కలెక్టర్ కోరారు.

**కళ్యాణమిత్రలు ఎంపిక :**

డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రతి మండలం నుండి ఒక రిజర్వుడుతో కలిపి ముగ్గురు కళ్యాణమిత్రలను ఎంపిక చేయడం జరిగింది. అదే విధంగా మెప్మా ఆధ్వర్యంలో ఐదు మున్సిపాలిటీల పరిధిలో నలుగురు రిజర్వుడుతో కలిపి 19 మందిని ఎంపిక చేయడం జరిగింది. జిల్లాలో మొత్తం 121 మంది కళ్యాణ మిత్రలను ఎంపిక చేసి వారికి చంద్రన్న పెళ్లికానుక రిజిస్ట్రేషన్‌కు అవసరమైన శిక్షణనిచ్చి మెటీరియల్‌ను అందజేయడం జరిగింది. అదేవిధంగా వారికి ట్యాబ్‌లను, సిమ్‌లను, బయోమెట్రిక్ డివైస్‌లను అందజేయడం జరిగింది. గ్రామస్థాయిలో 923 గ్రామ పంచాయతీలకు 923 మంది వివోఓలకు కూడా శిక్షణనివ్వడం జరిగింది. ఈ కళ్యాణమిత్రలు చంద్రన్న పెళ్లికానుకకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వధూవరుల వివరాలను పరిశీలించి ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఆధార్‌తో అనుసంధానించబడిన వధువు బ్యాంకు ఖాతాకు 20 శాతం ప్రోత్సాహకం జమ చేయబడుతుంది. వివాహం పూర్తయిన తదుపరి కళ్యాణమిత్రలు మరోసారి పరిశీలించి వారి వివాహ చిత్రాన్ని అప్‌లోడ్ చేయడం ద్వారా మిగిలిన 80 శాతం ప్రోత్సాహకం వధువు ఖాతాకు జమచేయబడుతుంది. అంతే కాకుండా వారం రోజులలోగా వివాహ ధృవపత్రాన్ని వారికి అందజేయడం జరుగుతుంది. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వెంటనే వధూవరులు మొబైల్స్‌కు రిజిస్ట్రేషన్ నమోదు అయినట్లు సంక్షిప్త సమాచారం అందుతుంది.

**చంద్రన్న పెళ్లికానుక ప్రోత్సాహకాలు :**

కులాంత వివాహం చేసుకున్న షెడ్యూల్డ్ తెగల దుంపతులకు రూ.75 వేలు, ఒకే కులానికి చెంది వివాహం చేసుకున్న షెడ్యూల్డ్ తెగల దంపతులకు రూ.50వేలు, కులాంతర వివాహం చేసుకున్న షెడ్యూల్డ్ కులాల దంపతులకు రూ.75వేలు, ఒకే కులానికి చెంది వివాహం చేసుకున్న షెడ్యూల్డ్ కులాల దంపతులకు రూ.40వేలు, కులాంతర వివాహం చేసుకున్న వెనుకబడిన తరగతుల దంపతులుకు రూ.50వేలు, ఒకే కులానికి చెందిన వివాహం చేసుకున్న వెనుకబడిన తరగతుల దంపతులకు రూ.35వేలు, సదరం ధృవీకరణ ప్రకారం కనీసం 40 శాతం అంగవైకల్యం ఉండి వివాహం చేసుకున్న దంపతులకు ఒక లక్ష రూపాయలు, మైనారిటీల వివాహానికి రూ.50వేలు, కార్మిక శాఖ జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా భవన నిర్మాణ కార్మికుల గుర్తింపు కార్డు కలిగి ఉన్న వధూవరులు వివాహం చేసుకున్న దంపతులకు రూ.20వేలు చంద్రన్న పెళ్లికానుక ప్రోత్సాహకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. అయితే ఈ చంద్రన్న పెళ్లికానుక ప్రోత్సాహకానికి వధువు 18 సంవత్సరాలు, వరుడు 21 సంవత్సరాలు నిండి ఉండి మొదటిసారి వివాహం చేసుకున్న వారు మాత్రమే అర్హులు.

**చంద్రన్న పెళ్లి కానుక రిజిస్ట్రేషన్ :**

చంద్రన్న పెళ్లికానుక వధూవరులు 1100 ఫోన్ చేసి లేదా మీసేవా కేంద్రంలో లేదా మొబైల్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్‌ను వివాహ తేదీకి 15 రోజులు ముందుగా నమోదు చేసుకోవాలి. అయితే ఈరోజు నుండి (ఏప్రిల్) ప్రారంభమైన ఈ ప్రక్రియకు సమయాభావం వలన మే4వ తేదీ వరకు వివాహం చేసుకున్న వారికి 15 రోజుల ముందస్తు నమోదు నుండి మినహాయింపునివ్వడం జరిగింది. మే5వ తేదీ లేదా తదుపరి తేదీ నుండి వివాహం చేసుకోదలచినవారు 15 రోజులు ముందుగా నమోదు చేసుకోవలసి ఉంది.

**జిల్లాలో మొట్టమొదటి రిజిస్ట్రేషన్ :**

జిల్లాలో మొట్టమొదటి చంద్రన్న పెళ్లికానుక రిజిస్ట్రేషన్‌ను ఎస్.కోట మండలం ధర్మవరంనకు చెందిన బిసిడి కులం వధూవరులు పెంట అప్పలనాయుడు, లగుడు భవానీలు వారి వారి తల్లిదండ్రులు, జిల్లా కలెక్టరు సమక్షంలో రిజిస్టేన్ చేయించుకున్నారు. వారికి అందిన సంక్షిప్త సమాచారాన్ని ఈ సందర్భంగా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ, మెప్మా పథక సంచాలకులు సుబ్బారావు, లక్ష్మునాయుడు, ఎపిడి మురళి, జిల్లా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు, కళ్యాణమిత్రలు పాల్గొన్నారు.

# కేంద్రం ప్రత్యేక హోదా ఇచ్చే వరకూ పోరాటం ఆగదు

## రాష్ట్ర మంత్రి సుజయ్‌కృష్ణ స్పష్టీకరణ



విజయనగరం: నాలుగేళ్లు గడచినా ప్రత్యేక హెూదా, విభజన చట్టం అంశాలపై కేంద్ర కేబినెట్ తీర్మానం చేయకపోవడం విచారకరమని రాష్ట్ర మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు అన్నారు. శుక్రవారం ప్రత్యేక హెూదా, విభజన హామీల చట్టం అమలు కోరుతూ జిల్లా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కోట జంక్షన్ వద్ద ధర్మపోరాట దీక్ష ప్రారంభమైంది. కేంద్ర మాజీ మంత్రి, విజయనగరం పార్లమెంట్ సభ్యులు పూసపాటి అశోక్‌గజపతిరాజు ఈ దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. దీక్షలో జిల్లా మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డా.శోభా స్వాతిరాణి, విజయనగరం ఎమ్మెల్యే మీసాల గీత, మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రసాదుల రామకృష్ణలతో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన కేడర్ యావత్తు దీక్షలో పాల్గొంది. ఈ సందర్భంగా జిల్లా మంత్రి సుజయ్‌కృష్ణ మాట్లాడుతూ అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ బాధ్యతలకు అనుగుణంగా ప్రజల కోరిక మేరకు హెూదా పోరాటం అవసరమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు చేపట్టిన ధర్మపోరాట దీక్షకు మద్దతుగా అన్ని జిల్లాల్లో ఈ దీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు, రాష్ట్రం నష్టపోకుండా ఉండేందుకు కేంద్రప్రభుత్వంతో పోరాటాన్ని ప్రారంభించామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ పోరాటం వెనుకంజ వేసే ప్రసక్తే లేదన్నారు. రాబోయే రోజుల్లో అన్నివిధాలుగా కేంద్ర చేసిన అన్యాయాన్ని ప్రజలకు పూర్తిస్థాయిలో వివరిస్తామన్నారు. విభజన చట్టం ప్రకారం ఆంధ్రరాష్ట్రానికి అన్నివిధాల సహాయం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. గత నాలుగేళ్లుగా కేవలం 20 శాతం సహాయం మాత్రమే ఆంధ్రరాష్ట్రానికి అందిందన్నారు. రాష్ట్రానికి మంజూరైన విద్యాలయాలు ప్రైవేటు భవంతుల్లో నడుస్తున్నాయన్నారు. తక్షణమే విద్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌పై కేంద్ర ప్రభుత్వ వైఖరి అవమానించే తీరిలో ఉందని మంత్రి సుజయ్ దుయ్యబట్టారు. నేటికి రాష్ట్రం లోటు బడ్జెట్‌ను భర్తీ చేసే ప్రయత్నం చేయలేదన్నారు. వెనుకబడిన జిల్లాలకు 350 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసి ఆ నిధులను బ్యాంకుల్లో జమ చేసి వెనువెంటనే తిరిగి ఈ నిధుల మొత్తాన్ని వెనక్కి తీసుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం అడిగితే ప్రధానమంత్రి అనుమతి లేకుండా నిధులు వేయడం జరిగిందని సమాధానం ఇవ్వడం సరికాదన్నారు. ఇది కేవలం ఆంధ్ర రాష్ట్రంపై కక్షపూరితంగానే కేంద్రం నడుస్తుందనడానికి ఉదాహరణ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి ఎప్పటికీ అధికారంలోకి రాదన్న విషయాన్ని గుర్తించిన బిజెపి ఆంధ్ర రాష్ట్రంపై నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఐదు కోట్ల మంది రాష్ట్ర ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక హెూదా సాధన కోసం ముఖ్యమంత్రి చేపట్టిన ధర్మపోరాట దీక్షకు ప్రజల సంపూర్ణ మద్దతు ఉందన్నారు. ప్రజల ఆకాంక్ష, ఆవేదన ఢిల్లీ పాలకులకు తెలిసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఇందుకు తగిన మూల్యం చెల్లించకతప్పదన్నారు.ప్రత్యేక హెూదాను కోరుతూ ధర్మపోరాట దీక్ష జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ మాట్లాడుతూ 2014 బిజెపితో పొత్తుపెట్టుకోవడం వలన రాష్ట్రానికి మేలు జరుగుతుందని ఆశించామని, మూడున్నర సంవత్సరాలు అయినా విభజన హామీలను కేంద్రప్రభుత్వం నెరవేర్చడంలో పూర్తి విఫలమైందన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్ని రకాల ఆందోళనలు చేయాలో అన్నీ చేయడం జరిగిందన్నారు.

2019 ఎన్నికల్లో రాష్ట్రానికి చంద్రబాబే తిరిగి ముఖ్యమంత్రి అవుతారని గంటా జోష్యం చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా విజయనగరం జిల్లాలో ప్రతిభ కనబరచిన ఇంటర్ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డా.శోభా స్వాతిరాణి, విజయనగరం ఎమ్మెల్యే మీసాల గీత, మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రసాదుల రామకృష్ణలతో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన కేడర్ యావత్తు దీక్షలో పాల్గొంది.

# లోక్ అదాలత్ తీర్పులపై హైకోర్టు సంచలన తీర్పు

లక్నో : లోక్ అదాలత్ ఇచ్చిన తీర్పులపై అపీలు చేయడం సాధ్యం కాదని అలహాబాద్ హైకోర్టు లక్నో ధర్మాసనం తీర్పు చెప్పింది. అయితే రాజ్యాంగంలోని అధికరణ 226 లేదా అధికరణ 227 ప్రకారం రిట్ పిటిషన్‌ను దాఖలు చేయవచ్చునని, దానికి కూడా అత్యంత పరిమిత కారణాలపై మాత్రమే విచారణార్హత ఉంటుందని తెలిపింది.

లోక్ అదాలత్ రాజీ ఆధారంగా జారీ చేసిన విడాకుల డిక్రీపై భార్య హైకోర్టులో అపీలు చేశారు. కుటుంబ న్యాయస్థానాల చట్టం, 1984; న్యాయ సేవల ప్రాధికార చట్టం, 1987లలో విధించిన నిబంధనలను పాటించకుండా ఈ విడాకుల డిక్రీ జారీ చేసినట్లు ఆరోపించారు.

దీనిపై జస్టిస్ అజయ్ లాంబా, జస్టిస్ అనంత్ కుమార్ ధర్మాసనం విచారణ జరిపింది. లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం, 1987లోని సెక్షన్ 21(2) ప్రకారం లోక్ అదాలత్ తీర్పులపై ఉభయ పార్టీల్లోనూ ఏ పార్టీ అయినా అపీలు చేయడం సాధ్యం కాదని తెలిపింది.

లోక్ అదాలత్ తీర్పుకు వివాదంలోని అన్ని పార్టీలు కట్టుబడి ఉండాలని తెలిపింది. అపీలును తోసిపుచ్చింది

## ఘనంగా శంకర జయంతి ఉత్సవము



అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరంలో శంకర జయంతి సందర్భంగా గ్రామోత్సవం ఘనంగా నిర్వహించిన వ్రత పురోహితులు.ఈ కార్యక్రమంలో పంచ సూక్తాలు పఠిస్తూ జయ జయ శంకర హర హర శంకర అంటూ గ్రామోత్సవం నిర్వహించారు ఈ కార్యక్రమంలో చామర్తి కన్నబాబు ,బండి నరసింహ మూర్తి, నాగాభట్ల సుబ్రహ్మణ్య లక్ష్మి నారాయణ , పాలంకి సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీగంగాదేవి మురుగులమ్మ దూప సేవ

అమలాపురం: అమలాపురం రూరల్ మండలం బండారులంక గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగాదేవి మురుగులమ్మ అమ్మవారి జాతర మహెూత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రామంలో నారాయణరావుపేట, అరటిమామిడితోట, శెట్టిబలిజ సంఘంవారి ఆధ్వర్యంలో అమ్మవారి దూప సేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. అమ్మవారి జాతరను 23వ తేదీ సోమవారం, తీర్థం 24న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు దంగేటి బుల్లబ్బులు, దొమ్మేటి బాబులు, గుత్తుల సత్తిబాబు , దంగేటి రుద్రప్రసాద్, గుత్తుల ఏసుబాబు, మామిడిశెట్టి విష్ణుప్రసాద్, గుత్తుల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్న ఆలయంలో ఆది శంకరాచార్యుల పూజా కార్యక్రమాలు



రావులపాలెం : ఆత్రేయపురం మండలం, వాడపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సందర్భముగా స్వామి వారి ఆలయంలో ఆదిశంకరాచార్యులు వారి పూజా కార్యక్రమములు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామస్తులు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో నాడీ వైద్యశిబిరం


విజయనగరం : రవిశంకర్ గురూజీ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం రింగురోడ్డులో గల ఆర్ట్ ఆఫ్ లివింగ్ కార్యాలయంలో నాడీవైద్యశిబిరం ఏర్పాటు చేసారు. శ్రీశ్రీ ఆయుర్వేద నాడీ పరీక్ష కేంద్రానికి సంబంధించిన వైద్యులు డాక్టర్ తిరుమల శ్రీనివాస్ నాడి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడీ పరీక్షల ద్వారా ఖచ్చితమైన, సమగ్రమైన రోగాలను నిర్ధారించేందుకు, వ్యాధి యొక్క లేదా రోగం యొక్క మూలకారణాలను కనుగొనేందుకు అవకాశం ఉంటుందని, శస్త్ర చికిత్సలు అవసరం లేకుండా వ్యాధులను నివారించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర సమన్వయకర్త తుమరాడ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## మే 1 నుంచి జ్ఞానధార

విజయనగరం: చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో పఠనాశక్తి పెంపొందించటానికి మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోజ్ఞానధార కార్యక్రమాన్ని చేపడుతున్నామని దానిని విజయవంతం చేయాలని జిల్లాకలక్టర్ వివేక్ యాదవ్‌స్పష్టం చేశారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించటమే దీని లక్ష్యమని తెలిపారు. శుక్రారం మధ్యాహ్నం కటక్టర్ కార్యాలయసమావేశ మందిరంలో జ్ఞానధార అమలుపై ప్రధాన ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు, మండల సమన్వయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా డి.-1, డి.-2 విద్యార్థులను గుర్తించి ఈ కార్యక్రమంలో శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. 6గంటలు మాత్రమే భాష, సైన్సు, గణితం శాస్త్రాలపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. శిక్షణకు మాజరైయ్యే విద్యార్థులకు స్టడా మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులకుప్రత్యేక తరగతులు నిర్వహించి నాణ్యమైన వసతిసౌకర్యాలు కల్పిస్తామన్నారు. తల్లిదండ్రులు అపోహపడవలసిన అవసరం లేదని విద్యార్థుల యోగక్షేమాలపై నిరంతర పర్యవేక్షణ వుంటుందన్నారు. విఆ్యర్థులు 100 శాతం ఉత్తీరణత చెందిన పాఠ్యాంశాలు చదవడంలో వెనకడబి వుంటున్నారని అటువంటి విద్యార్థులకు విద్యాప్రమాణాలు మెరుగుపర్చడానికి ఈ శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. మనఊరు-మనబడి కార్యక్రమంలో మధ్యలో బడి మానేసిన విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని సూచించారు. అందరూ అందరూసమన్వయంతో పనిచేసి డ్రాప్‌అవుట్స్

లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మౌళిక సదుపాయాలు, ఉచితంగా పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజనపథకం, ఏకరైప దుస్తుల సరఫరపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. విద్యవలన కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు.చిట్టిగురువులు కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. జిల్లాలో అక్షరాస్యత పెంచడానికి చిట్టిగురువులు దోహదపడు తుందన్నారు. జిల్లాలో అమలు చేస్తున్న చిట్టిగురువులు కార్యక్రమం దేశ స్థాయిలో ఖ్యాతి గడించిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కనీసం వ్రాయడం, చదవడం నేర్పుకోవాలన్నారు. బస్సు ఏ ఊరు వెళుతుందో ఇతరులను అడిగి తెలుసుకోకుండా స్వయంగా చదివే విధంగా అక్షరాలు నేర్చుకోవాలన్నారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పాఠశాలలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని చెప్పారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



విజయనగరం : పట్టణంలో మహారాజ ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. విజయ నగరం 1వ పట్టణ పోలీస్ స్టేషన్ ఎఎస్సై అప్పలనాయుడు అందిం చిన వివరాల ప్రకారం మరణించిన వ్యక్తి వయస్సు సుమారు 55 సంవత్సరాలు ఉంటాయని, ఎత్తు 5 అడుగుల 6 అంగులాలు, క్రీమ్ కలర్ ప్యాంటు ధరించి దానిపై తెల్లని రంగు గీతలు కలిగిన ఫుల్ హ్యాండ్స్ షర్టు ధరించి, తెల్లని జుత్తు, గడ్డం కలిగి ఉన్నాడని తెలియ జేశారు. ఈ మృతిని గురించి ఆసుపత్రి పరిసర ప్రాంతాలలో ఉన్న వారిని విచారణ చేయగా మృతుడు ఆసుపత్రి పరిసర ప్రాంతాలలో బిక్షాటన చేసుకొని తిరుగుతూ ఉండేవాడని తెలియజేశారు. విజయనగరం 1వ పట్టణ పోలీసులు మృతదేహానికి శవపంచనామా జరిపించి, మృతదేహాన్ని మార్చురీలో భద్రపరచడమైనదని తెలియజేశారు. విజయనగరం 1వ పట్టణ పోలీసులు కేసు నమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నారు. ఆచూకి తెలిసిన వారు విజయనగరం 1వ పట్టణ పోలీసు స్టేషన్ పోన్ నెం.08922- 226444, ఎఎస్సై అప్పలనాయుడు పోన్ నెం. 9949794822 కు సంప్రదించ వచ్చునని తెలియజేశారు.

## ఘనంగా వనదుర్గమ్మవారి ఆలయంలో చండీ హోమం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వనదేవతగా పూజలు అందుకొంటున్న వనదుర్గమ్మవారి గుడిలో ఘనంగా చండీ హోమం నిర్వహించారు. ఉదయం 9గం.లకు విఘ్నేశ్వరుని పూజా,పుణ్యవచనం అమ్మవారికి ముల మంత్ర జపములు చండీ సప్తపతి పారాయణములు నిర్వహించారు. 11గం.లకు పూర్ణహుతి గావించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు గాడేపల్లి.వెంకట్రావు, అర్చకులు చల్లపల్లి.ప్రసాద్ శర్మ తదితరులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎమ్.జితేంద్ర, ఎసి. ఈరంకి.జగన్నాధరావు, టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి. లక్ష్మి నారాయణ, సీసీ గణపతి, ఆలయ సిబ్బంది,గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు. వేదపండితుల వేదాశీస్సులు అనంతరం భక్తులకు తీర్ధ, ప్రసాదాలు అందజేసారు.